సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 20-12-2024 ₹ 15/-


# ఇదా నవభారతం?



# సిరియా సంక్షోభం

సహజీవన భావాల పావురాయి

గీటురాయి

వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 50 హైదరాబాద్
శుక్రవారం 20 డిసెంబర్ 2024 రూ.15-00
18 జమాది ఉల్ ఆఖిర్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

ఎంత చిన్నపని అయినా సరే నిరంతరం చేస్తూనే ఉండాలి. అదే మంచి ఆచరణ.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




12

# ఆత్మ పరిశుద్ధత

## లోపల...


| | |
|---|---|
| న్యాయం ...... | 04 |
| ఇదా నవభారతం? ...... | 05 |
| సిరియా సంక్షోభం ...... | 08 |
| ఐక్యతా దినోత్సవం జరుపుకుందాం ...... | 11 |
| సంభల్ ఘటన ఏం చెబుతోంది? ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| చరితార్థులు-2 : మధురై జమాల్ ముహమ్మద్ ...... | 21 |
| ఆచరణకు ప్రాణం విశ్వాసం ...... | 22 |
| కృషితో నాస్తి దుర్భిక్షం ...... | 25 |
| ఫజర్ నమాజుకు లేస్తున్నారా? ...... | 26 |
| అసూయ : అపాయం-ఉపాయం ...... | 28 |
| కేరళలో సంస్కృతం బోధిస్తున్న ముస్లిం ఉపాధ్యాయులు ...... | 31 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది ...... | 34 |


**సవాలక్ష సమస్యలున్నయి..**



మంచువారి ఇంటిగోల
మీడియాకు పండుగ
మసాల బాగ దట్టించి
వేపుతున్నరు దండిగ!
యాడనైన సావనీండి
మనకెందుకు దండగ
సామాజిక సమస్యలు
ఉన్నయిగా మెండుగ!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## న్యాయం

ఇది అందరూ చదవవలసిన కథ.

అతుల్ ఒక 34 సంవత్సరాల యువకుడు. ఆత్మహత్య చేసు కున్నాడు. కారణం, భార్యతోను, భార్య కుటుంబంతోను న్యాయపోరాటం, స్వంత బిడ్డను నెలలతరబడి చూడలేని పరిస్థితి మాత్రమే కాదు, న్యాయస్థానంలో ఎదురైన అనుభవాలు కూడా కారణమే. అతని ఆత్మహత్య వెనుక జటిలమైన వ్యక్తిగత కారణాలే కాదు, మన వ్యవస్థ కూడా ఉంది. నత్తనడక నడిచే న్యాయ ప్రక్రియ. కన్నబిడ్డకు దూరంగా ఉంటున్న మానసికస్థితి. ఇది అతుల్ కథ. ఒక టెక్కీ కాబట్టి తన వ్యధను ప్రపంచానికి తెలియజేసి ప్రాణాలు తీసుకున్నాడు. ఇలా చెప్పలేక ప్రాణాలు తీసుకుంటున్న వారెంతమంది?

భారతదేశంలో విడాకులు, మనోవర్తి, కుటుంబ వ్యవహారాల చట్టాలు అవసరమైనవి. కాని ఇవి దుర్వినియోగానికి గురవ తున్నాయన్న వాస్తవం ఇప్పుడు స్పష్టంగా ముందుకు వస్తోంది. కొందరు మహిళలు చట్టాలను ఆసరాగా చేసుకుని భర్తలను వేధిస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఫలితంగా ఈ చట్టాల ప్రధానోద్దేశ్యమే దెబ్బతింటోంది.

వివాహం, సంబంధాలకు సంబంధించిన సమస్యలతో ఆత్మ హత్యలనేవి దేశంలో మూడవ స్థానంలో ఉన్నాయి. సంబం ధిత చట్టాలను చూస్తే, హిందూ మ్యారేజ్ యాక్ట్ 1955, స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ 1954, గృహహింస నిరోధక చట్టం 2005 తదితర చట్టాలు మన ముందుకు వస్తాయి. ఈ చట్టాలు మహిళలకు భద్రత, విడాకుల తర్వాత ఆర్థిక భద్రత కల్పించడానికి ఉద్దేశించినవి. కాని వీటిని దుర్వినియోగిస్తున్న సందర్భాలు మన ముందుకు వస్తున్నాయి.

తన ఆత్మహత్యకు ముందు ఒక వీడియోలో తన ఆత్మహత్యకు కారణాలను వివరించాడు. అందులో భార్య, ఆమె కుటుంబం తరఫున వేధింపులే కాదు, న్యాయవ్యవస్థ తీరుపై కూడా ప్రశ్నలు సంధించాడు. మనోవర్తి పేరుతో తన దగ్గర డబ్బులు పిండుకునే ప్రయత్నాలను గురించి చెప్పాడు. డబ్బులు ఇవ్వలేకపోతే ఆత్మహత్య చేసుకో అని భార్య కోర్టులోనే చెబితే న్యాయమూర్తి నవ్విందన్న విషయం కూడా చెప్పాడు. అంతేకాదు, భర్తపై ఆ భార్య అనేక కేసులు వేసింది. ఈ వేధింపుల గురించి వివరంగా చెప్పాడు.

సోషల్ మీడియాలో ఇప్పుడు అతుల్ ఆత్మహత్యపై చర్చ జోరుగా జరుగుతోంది. కొంతకాలం తర్వాత చల్లబడవచ్చు. కాని అతుల్ ఆత్మహత్యలో పేర్కొన్న విషయాలపై లోతుగా ఆలోచించడం జరుగుతుందా? దుర్వినియోగమవుతున్న చట్టాలపై ఆలోచించడం జరుగుతుందా? కేసు వేసి కోర్టుల చుట్టూ తిప్పడమే శిక్షగా మారిన పరిస్థితిపై ఆలోచించడం జరుగుతుందా? లంచాలడిగే దౌర్భాగ్యపు పరిస్థితి గురించి ఆలోచించడం జరుగుతుందా?

ఇటీవల నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ సర్వే వచ్చింది. దేశంలో 15 నుంచి 29 ఏండ్ల లోపు యువతలో 23 శాతం మంది పెళ్ళి అంటే ఇష్టపడడం లేదు. దీనికి కారణాలు స్వేచ్ఛ కోసం మాత్రమే కాదు కుటుంబ భారం పడుతుందనే భయమూ ఉంది.

ఈ సర్వేను దృష్టిలో పెట్టుకుని చట్టాల దుర్వినియోగం వల్ల అతుల్ వంటి ఆత్మహత్యల కేసులను కూడా దృష్టిలో ఉంచు కుని ఆలోచంచవలసిన అవసరం ఉంది.

కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతున్న పరిస్థితిని ఈ వార్తలు సూచిస్తున్నాయి. వివాహం, విడాకులు, మనోవర్తి, పిల్లల పెంపకం విషయాల్లో చట్టాల దుర్వినియోగాన్ని ఆపడానికి మాత్రమే కాదు, సక్రమమైన, సమాజ శ్రేయానికి ఉపయోగ పడే విధానాలను అవలంబించవలసిన అవసరం ఉంది.

అబ్దుల్ వాహెద్

# ఇదా నవభారతం?

**ఇప్పుడు** పరిస్థితులు చాలా మారిపోయాయి. మతతత్వ వ్యాఖ్యలు చాలా సహజంగా వినిపిస్తున్నాయి. ఉన్నత స్థానాల్లో కూర్చున్న ప్రముఖులు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుపడదమూ లేదు, సంకోచించడమూ లేదు.

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ యాదవ్ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో, ఆయన వివాదాస్పద ప్రసంగం చేశారు. తన ప్రసంగంలో ముస్లింలను ప్రత్యేకంగా ప్రస్తావించనప్పటికీ, ఆయన ప్రసంగం ఎవరిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారో అర్థం చేసుకోడానికి విశ్లేషణలు, వివరణలు అవసరం లేదు. "చిన్నప్పటి నుంచి జంతు వధను చూస్తూ పెరిగిన వారి పిల్లల్లో దయాగుణం, సహనం ఉంటాయా?" అని ప్రశ్నించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశ జనాభాలో 77 శాతం మాంసాహారులే. కొన్ని రాష్ట్రాల్లో మాంసాహారుల సంఖ్య ఈ సగటు కన్నా చాలా ఎక్కువ. మాంసాహార కుటుంబాల్లో పిల్లలంతా రోజూ జంతువధ చూస్తూ పెరుగుతారా? గౌరవనీయ న్యాయమూర్తి వ్యాఖ్యలను ఎలా అర్థం చేసుకోవాలి? ఈ ప్రసంగంలో ఆయన ముస్లిములను ఉద్దేశించి తిట్టుపదాల వంటివి కూడా ఉపయోగించారు. ఈ సముదాయం దేశానికి హానికరమైనదని కూడా చెప్పేశారు.

ఇదీ ఇప్పుడు దేశంలో ఉన్న పరిస్థితి.

వివాదాస్పద వ్యాఖ్యల తర్వాత, డిసెంబర్ 10న సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలపై అలహాబాద్ హైకోర్టు నుండి వివరాలను కోరింది. ఒక హైకోర్టు న్యాయమూర్తి వంటి రాజ్యాంగ స్థానంలో ఉన్న వ్యక్తి, బహిరంగంగా ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం అత్యంత ఆందోళనకరం. కాని చాలా మందికి ఇప్పుడు ఇది మామూలు విషయమే. కాని ఇలాంటి వ్యాఖ్యల తర్వాత న్యాయమూర్తుల తటస్థత పట్ల ప్రజల్లో విశ్వాసం ఉంటుందా?

అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గోవింద్ మాథుర్, జస్టిస్ యాదవ్ చేసిన ప్రకటనను రాజ్యాంగ విలువలకు, లౌకిక సిద్ధాంతాలకు పెనువిఘాతంగా పేర్కొన్నారు.

జస్టిస్ యాదవ్ ఇలాంటి వ్యాఖ్యలు గతంలో కూడా చేసే ఉన్నారు. ఆయన ఇచ్చిన తీర్పుల్లో గీతదాటిన ఉదాహరణ లున్నాయి. సెప్టెంబర్ 2021లో ఉత్తరప్రదేశ్‌లో గోవధ నిరోధక చట్టం కింద ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి బెయిల్ నిరాకరిస్తూ, ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి. ఆవుల రక్షణ హిందువుల మౌలిక హక్కుగా చట్టంలో చేర్చాలి. ఎందుకంటే దేశ సంస్కృతి, నమ్మకాలు దెబ్బతిన్నప్పుడు దేశం బలహీనపడుతుంది అన్నారు. ఒక బెయిల్ వ్యవహారంలో ఈ వ్యాఖ్యలు చేయవలసిన అవసరమేముంది? అంతేకాదు, "జబ్ గాయ్ కా కళ్యాణ్ హెూగా, తభీ దేశ్ కా కళ్యాణ్ హెూగా" (ఆవు సంక్షేమమే, దేశ సంక్షేమం అని అనువదించవచ్చును కుంటాను.) అన్నారు.

అక్టోబర్ 2021లో, మరో సందర్భంలో జస్టిస్ యాదవ్, భారతదేశ సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన శ్రీ రాముడు, శ్రీ కృష్ణుడు, గీత, రామాయణం, మహర్షి వాల్మీకి, మహర్షి వేదవ్యాసుడు–అన్నింటిని గౌరవించేలా పార్లమెంట్ చట్టం చేయాలని సూచించారు. గీత, రామాయణం వంటి హిందూ మత గ్రంథాలను పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చాలని చెప్పారు. బెయిల్ ఆదేశాల్లో సాధారణంగా న్యాయస్థానం బెయిల్ ఇవ్వవచ్చా లేదా అన్నది మాత్రమే పరిశీలిస్తుంది. అయినా ఇలాంటి వ్యాఖ్యలు ఆయన చేశారు.

ప్రజాస్వామ్యంలో, న్యాయ వ్యవస్థ రాజకీయాలకు దూరంగా, స్వతంత్రంగా వ్యవహరించాలి. జస్టిస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు న్యాయ, రాజకీయ రంగాల మధ్య ఉన్న కీలక విభజన రేఖను చెరిపేస్తున్నాయి. సున్నితమైన సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి.

జస్టిస్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు ఒక న్యాయమూర్తి స్థాయిని మాత్రమే కాదు, న్యాయపరమైన సమగ్రతను, నిష్పక్షపాతాన్ని కూడా దెబ్బతీస్తాయి. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని నేరుగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత సుప్రీం కోర్టుపై ఉంది. సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలపై ప్రతిస్పందించారు.

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (AILU), ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (AILAJ) ఈ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించాయి.

AILU ఆయన ప్రసంగంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, భారత రాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. మరోవైపు, AILAJ యాదవ్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేసింది. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, "న్యాయమూర్తుల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడం" పట్ల ఒక "ఇన్-హౌస్ విచారణ" జరపాలని భారత ప్రధాన న్యాయమూర్తిని కోరారు.

కాని ఇలాంటి సంఘటనలు ఇటీవల మన ముందుకు వస్తూనే ఉన్నాయి. మస్జిదులో "జై శ్రీరాం" నినాదాలు చేశారన్న ఆరోపణలతో దాఖలైన ఒక కేసును కర్ణాటక హైకోర్టు ఇటీవల కొట్టేసింది. ఇలా మస్జిదులో జైశ్రీరాం నినాదాలిచ్చినంత మాత్రాన మతభావాలు దెబ్బతింటాయా అని వ్యాఖ్యానించింది. న్యాయమూర్తి ఎం. నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. మస్జిదులో జైశ్రీరాం నినాదాలివ్వవచ్చని భావిస్తే, మందిరాల్లో ఇతర మతసముదాయాల నినాదాలివ్వవచ్చని కూడా భావించవచ్చా? ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులకు కారణమయ్యే వాతావరణం అలుముకుంటోంది.

కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి వేదవ్యాసాచార్ శ్రీశానంద బెంగుళూరులోని ఒక ప్రాంతాన్ని "పాకిస్తాన్" అని సూచిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగుళూరులోని గోరి పాళ్య ప్రాంతం గురించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇటీవల మరో న్యాయమూర్తి నారిమన్ చేసిన ప్రసంగాన్ని ఈ నేపథ్యంలో చూడవలసి ఉంది.

"సెక్యులరిజం మరియు భారత రాజ్యాంగం" అనే అంశంపై జస్టిస్ ఏఎం అహ్మది స్మారక ఉపన్యాసంలో, సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఆర్ఎఫ్ నారిమన్ మాట్లాడుతు, బాబరీ వివాదానికి సంబంధించిన తీర్పు గురించి చెప్పారు. 2019లో వివాదాస్పద స్థలాన్ని హిందువులకు ఆలయం నిర్మాణానికి కేటాయించిన తీర్పును "న్యాయానికి అవమానం"గా రాజ్యాంగంలోని సెక్యులర్ సూత్రాలను బలహీనపరిచిన తీర్పుగా పేర్కొన్నారు.

జస్టిస్ నారిమన్ బాబరీ మస్జిద్ వివాదంలో సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాలు సెక్యులరిజాన్ని నిలబెట్టడంలో విఫలమయ్యాయని అన్నారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత అక్రమమని ఒప్పుకుంటూనే, 2019 తీర్పులో ఆ స్థలాన్ని ఆలయ నిర్మాణానికి హిందువులకు కేటాయించిన తీర్పును జస్టిస్

నారిమన్ తీవ్రంగా విమర్శించారు. 2003లో భారత పురావస్తు సర్వే (ASI) నివేదికలో కూడా మస్జిదు కింద రామమందిరం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని తేలింది. అయినప్పటికీ, కోర్టు ఆ స్థలం హిందువులదేనని నిర్ణయించింది. "ఇది న్యాయానికి అవమానం," అని నారిమన్ పేర్కొన్నారు. బాబరీ మస్జిదు కూల్చివేతకు సంబంధించిన కేసులో నిందితులందరిని నేర విముక్తులుగా ప్రకటించడాన్ని కూడా ఆయన విమర్శిస్తూ, ఆ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తిని తర్వాత ఉత్తర ప్రదేశ్ ఉప లోకాయుక్తగా నియమించడాన్ని వేలెత్తి చూపించారు.

ఈ వార్తలన్నీ చదివి, ఈ నేపథ్యంలో నేడు దేశంలో ఉన్న పరిస్థితులను ఒకసారి చూడండి.

ఇది ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన వార్త. మీరట్‌లో ఖైరతీ లాల్ అనే వ్యక్తి ప్రహ్లాద్ నగర్ ప్రాంతంలోని ఇల్లు ఒక ముస్లింకు అమ్మడానికి 5 లక్షలు అడ్వాన్సు తీసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తర్వాత ఇరుగుపొరుగు హిందువులు గగ్గోలు చేశారు. హిందూ ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో ముస్లిములను అనుమతించేది లేదన్నారు. ఒక టెంట్ ఏర్పాటు చేసి హనుమాన్ చాలిసాను పఠించడం ప్రారంభించారు. చివరకు ఆ ఆస్తి కేవలం హిందువులకే అమ్ముతానని ఖైరతీలాల్ చెప్పిన తర్వాత వివాదం సద్దుమణిగింది. మరో సంఘటన మురాదాబాద్ కు సంబంధించిన సంఘటన. బాగా చదువుకున్న వారు డాక్టర్లు ఉంటున్న ఒక కాలనీలో 400 కంటే ఎక్కువ హిందూ కుటుంబాలు ఉన్నాయి. ఆ కాలనీలో ఒక ముస్లిం డాక్టరు కొత్తగా ఫ్లాట్ కొనుగోలు చేసారు. అంతే అక్కడ నివసిస్తున్న ఉన్నత విద్యావంతులైన హిందూ కుటుంబాలు తమ మహిళలకు భద్రత ఉండదని ఆందోళన చేపట్టారు. ఈ వార్తలన్నీ మనం చదువుతున్నాం.

అలాగే –

మధ్య ప్రదేశ్‌లోని రత్లామ్ జిల్లాలో ముగ్గురు ముస్లిం పిల్లలను "జై శ్రీరాం" చెప్పాలంటూ చితకబాదిన ఘటన వెలుగులోకి వచ్చింది.

చెప్పాలంటే, మూకహత్యలు, గోవధ పేరుతో జరుగుతున్న దారుణాలు, దాడులు, బుల్డోజర్ న్యాయాల గురించి వార్తల్లో చదువుతూనే ఉన్నాం.

న్యాయవ్యవస్థ లో ఉన్న ప్రముఖులే మతతత్వ వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో ఎలాంటి సామాజిక వాతావరణం అలుముకుంటుందో వేరే చెప్పనవసరం లేదు. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల్లోనే మార్పు రావాలి. ✤

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- **సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.**
- **ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.**
- **ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.**
- **ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.**



# సిరియా సంక్షోభం

ఉమైర్

**డిసెంబర్ 8న,** సిరియాలో ప్రభుత్వం కుప్పకూలింది. ఐసిస్-2 నాయకుడు అబు ముహమ్మద్ అల్ జులానీ ఆధ్వర్యంలో కొత్తప్రభుత్వం ఏర్పడింది. అమెరికా గ్లోబల్ టెర్రరిస్ట్ అని ప్రకటించిన జులానీ ఇప్పుడు పశ్చిమ మీడియాకు ఆప్తుడై పోయాడు. సిరియా అధ్యక్షుడు బషార్ అల్ అసద్ ప్రాణాలు దక్కించుకుని రష్యా పారిపోయాడు. రష్యా, ఇరాన్, ఇరాక్, సిరియా, చైనా ఇంటెలిజెన్స్ ఏజెన్సీలన్నీ విఫలమయ్యాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఇస్రాయిల్, టర్కీ కలిసి పనిచేశాయని, వెన్నుదన్నుగా అమెరికా ఉందని తెలుస్తోంది.

సిరియా సైన్యం అధ్యక్షుడు బషార్ అల్ అసద్‌కు సహాయ నిరాకరణ చేయడంతో ఆయనకు పలాయనం తప్పలేదు.

సెప్టెంబర్ 30 నుండి ఇజ్రాయిల్‌తో పోరాడుతున్న లెబనాన్‌లోని హిజ్బుల్లాకు రష్యా, ఇరాన్ దేశాలే ఆయుధాలిస్తున్నాయి. ఈ ఆయుధాల సరఫరా మార్గంగా సిరియా ఉపయోగపడుతూ వచ్చింది. ఈ మార్గం ఇప్పుడు మూసుకుపోయింది.

కాని, ఈ చర్య వల్ల ఇస్రాయిల్ లేదా అమెరికాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలేవీ ఉండవని నిపుణుల అభిప్రాయం. ఉదాహరణకు లిబియాలో కూడా ఇలాగే గడాఫీని కూలదోసిన అమెరికా తర్వాత సాధించింది ఏదీ లేదు. సిరియా విషయంలోను, బషారుల్ అసద్‌ను గద్దె దించి హిజ్బుల్లాకు ఆయుధ సరఫరా అడ్డుకోవలన్నదే ప్రధాన లక్ష్యమైతే, అది నెరవేరడం కష్టమని నిపుణుల అభిప్రాయం. ఎందుకంటే, లెబనాన్‌లో ఇరాన్ ఇప్పటికీ చాలా బలంగా ఉంది. హిజ్బుల్లా వద్ద రాకెట్లు, క్షిపణులు వేలాది ఉన్నాయని వార్తల వల్ల తెలుస్తోంది. దాదాపు రెండు సంవత్సరాల కాలం ఆయుధ సరఫరా లేకపోయినా హిజ్బుల్లా పోరాడే స్థితిలో ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో సిరియాలో ఎదురైన ప్రతికూల పరిస్థితిని ఈ రెండేళ్ళలో ఇరాన్ మార్చుకునే ప్రయత్నాలు చేస్తుంది. హిజ్బుల్లా ఆయుధ సరఫరాకు కొత్త మార్గాలను కనిపెడుతుందని నిపుణుల అభిప్రాయం. ఇరాన్ ను అణచడానికి రష్యా 2022 నుంచి ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తోంది. రష్యాకు మిలిటరీ డ్రోన్లు ఇరాన్ సరఫరా చేస్తుంది. ఇరాన్ రష్యాల మధ్య ఉన్న ఈ సంబంధం చాలా కీలకమైనది. మధ్యప్రాచ్యంలో ఇరాన్, రష్యాలు తమ పలుకుబడి పెంచుకునే ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటాయి. మరోవైపు చైనా చేస్తున్న ప్రయత్నాలు కూడా ఉన్నాయి. వీటన్నింటిని దెబ్బతీసి, సిరియాలో తిష్ఠవేయడానికి అమెరికా వేసిన ఎత్తుగడగా కొందరు ప్రస్తుత పరిణామాలను చూస్తున్నారు. ఇదంతా ఒక ఒప్పందం ప్రకారమే జరిగిందని, రష్యా, ఈరాన్ లకు కూడా ఈ పరిణామాలు ముందే తెలుసన్న వార్తలు కూడా వస్తున్నాయి.

అయితే రష్యా కాస్త వెనక్కి తగ్గిందన్నది మాత్రం నిజం. అమెరికా అధ్యక్షుడు జోసెఫ్ బైడెన్ ఆదేశాల మేరకు ఉక్రెయిన్ అకస్మాత్తుగా రష్యాపై దీర్ఘ-శ్రేణి క్షిపణులను ఉపయోగించింది. రష్యా వెంటనే తన అణు విధానాన్ని మార్చింది. రష్యా ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధం నుంచి వైదొలిగే ఆలోచనల్లో కనిపిస్తుంది. అందువల్లనే ఇస్రాయిల్, టర్కీ మద్దతుతో ఐసిస్-2కు అనుకూల పరిస్థితులు సృష్టించారు.

గమనించవలసిన విషయమేమిటంటే, ఇంతకు ముందు కూడా ఐసిస్‌ను అణిచివేసిన ఘనత హిజ్బుల్లాదే. ఇప్పుడు జులానీ తమ తర్వాతి లక్ష్యం ఇస్రాయిల్ అంటున్నప్పటికీ నిజానికి ఇస్రాయిల్, ఐసిస్ 2 కలిసి పనిచేస్తున్నాయని, హిజ్బుల్లాపై దాడులకు సిద్ధమవుతున్నాయని నిపుణుల అభిప్రాయం. ఇస్రాయిల్ డమస్కస్‌పై వరుస దాడులు చేస్తున్నప్పటికీ, సిరియాలో అధికారం పొందిన ఐసిస్ 2 నోరు విప్పడం లేదన్నది గమనించాలి.

టర్కీలో ఉర్దుగాన్ కాని, అరబ్బు దేశాల్లో పాలకులు కాని పైకి చెబుతున్న మాటలకు వారి మనసులో పథకాలకు సంబంధమే లేదు. అరబ్బు దేశాధినేతలైతే నిద్రమత్తులోనే ఉన్నారు. పాలస్తీనాలో ఇస్రాయిల్ జాతి నిర్మూలనకు పాల్పడుతున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదు.

సిరియాలో నుండి లెబనాన్‌కు సరఫరా మార్గాలను అడ్డుకోవడం ప్రారంభమైంది. ఐసిస్-2కు అసలు ప్రత్యర్థి ఇరాన్. ఇరాన్ ఈ సంఘటనను తీవ్రంగా విమర్శించింది. రష్యా బలగాలు ఉన్నప్పుడు, ఇస్రాయిల్ సిరియాలో అంగుళం కూడా ముందుకు సాగలేకపోయింది. ఇప్పుడు టర్కీ సహాయంతో అవకాశం కలిసివచ్చింది. సిరియాలో ఇప్పుడు ఇస్రాయిల్ ప్రాబల్యం కొనసాగవచ్చు. సిరియా ముక్కలుగా మారినా ఆశ్చర్యం లేదు. కుర్దులు, అలవీస్, ఐసిస్, ఇస్రాయిల్ పంచుకుంటాయని కొందరి అభిప్రాయం. అరబ్బు దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ సిరియాపై ఇస్రాయిల్ తన దాడులను కొనసాగిస్తోంది. ఇస్రాయెల్ దాడులను ఐసిస్-2 సమర్థిస్తుందా? టర్కీ దీనికి మద్దతు ఇస్తుందా? టర్కీ శరణార్థుల సమస్యను పరిష్కరించడానికే సిరియాను ఉపయోగించిందని కొందరి అభిప్రాయం.

ఇరాన్‌లో కూడా ఇలాగే ప్రభుత్వాన్ని మార్చి కీలుబొమ్మలను తేవాలన్నది ఇస్రాయిల్, అమెరికాల వ్యూహం. ఇరాన్ అధ్యక్షుడికీ, సుప్రీం లీడర్ అయాతుల్లా ఖొమేనీ మధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. జూలై 30న ఇరాన్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం సందర్భంలోనే ఇస్మాయిల్ హనియను ఇస్రాయిల్ హత్య చేసినప్పటికీ ఇరాన్ వెంటనే ప్రతిస్పందించలేదు. ఇరాన్‌లో ఉన్న సమస్యలను ఇస్రాయిల్ తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాల్లో ఉంది.

సిరియా మరింత కల్లోలంలోకి నెట్టబడుతున్న నేపథ్యలో అమెరికా అధ్యక్షుడు ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను ఉక్రెయిన్ అధ్యక్షుడు తిరస్కరించాడు. అమెరికా సిరియా నుండి తన సేనలను ఉపసంహరించుకుంటుందా? ట్రంప్ ప్రమాణ స్వీకారం తర్వాత ఏం జరుగుతుందో చూడవలసి ఉంది. రష్యా, ఇరాన్ ఆయుధాలు లేకుండా లెబనాన్ హిజ్బుల్లా ఇస్రాయిల్ దాడులను తట్టుకోగలదా? అనే ప్రశ్నకు కూడా చాలా నిరాశాజనకమైన జవాబు వస్తోంది. అదేమిటంటే, పాలస్తీనాలో హమాస్‌ను తుదముట్టిస్తానని యుద్ధం చేస్తున్న ఇస్రాయిల్ హమాస్‌ను ఏమీ చేయలేకపోయింది, కానీ పసిపిల్లలతో సహా సాధారణ ప్రజలను వేలాది మందిని చంపుతోంది. మరోవైపు హిజ్బుల్లాపై యుద్ధం పేరుతో కూడా చంపుతోంది సాధారణ లెబనాన్ ప్రజలనే. హిజ్బుల్లా చెక్కుచెదరలేదు. పైగా హిజ్బుల్లా వద్ద ఉన్న ఆయుధాలతో రెండేళ్ళపాటు ఇస్రాయిల్ కు సవాలు విసరగలదని కొందరి అభిప్రాయం. ఈ నేపథ్యంలో ఇప్పుడు తనకు అనుకూలంగా ఉన్న ఐసిస్ 2 అధికారంలోకి వచ్చినప్పటికీ సిరియాపై అమానుష దాడులు కొనసాగిస్తూనే ఉంది. బషారుల్ అసద్‌ను గద్దె దించడాన్ని అమెరికా స్వాగతించింది. సిరియాకు సహాయం చేసేందుకు ప్రణాళికలను వివరించారు. ఐసిస్ తిరిగి తలెత్తకుండా చేస్తామన్నారు. కాని అసద్‌ను గద్దె దించడానికి ఉపయోగపడింది ఐసిస్ 2యే.

సిరియాలో 12 మిలియన్లకు పైగా ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బాధితులయ్యారు. ఈ దుస్థితి మధ్యప్రాచ్యాన్ని దెబ్బతీస్తోంది. యునైటెడ్ నేషన్స్ అంచనా ప్రకారం సిరియా పునర్నిర్మాణానికి 400 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు అవుతుంది. ఈ విధ్వంసాన్ని అగ్రరాజ్యాలేవీ పట్టించుకోవు. శక్తి సమీకరణాల్లో సమిధలవుతున్నది సాధారణ ప్రజలే.

ఎమన్‌లో హూతీలు తమ దాడులను ఆపలేదు. హమాస్ కు తమ మద్దతు విషయంలో స్థిరంగా ఉన్నారు. రష్యా ఉక్రెయిన్ సమస్య నుంచి బయటపడి మధ్యప్రాచ్యంపై దృష్టిపెట్టే ప్రయత్నాల్లో ఉంది. ఇరాక్ పై దాడికి అమెరికా ప్రయత్నిస్తుందంటూ ఇరాన్ చేసిన ప్రకటన మరింత అయోమయాన్ని సృష్టించింది. ఇరాన్ అణుకార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. అమెరికా ప్రయత్నాలు, ఇస్రాయిల్ ప్రయత్నాలు ఇరాన్‌ను ఇంతవరకు బలహీనపరచ లేకపోయాయి. ఏది ఏమైనా సిరియాలో అధికార మార్పిడి తర్వాత మధ్యప్రాచ్యంలో సమీకరణాలు మారుతున్నాయి. అమెరికా ప్రాబల్యం పెరుగుతుందా? టర్కీ పరిస్థితి ఏమిటి? టర్కీలో ఉర్దుగాన్ అధికారం కొనసాగుతుందా? రష్యా, చైనా దేశాలు మధ్యప్రాచ్యంలో ఎలాంటి వ్యూహాన్ని పాటిస్తాయి? అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చిన తర్వాత మారే పరిస్థితులేమిటి? పలస్తీనా సమస్యకు పరిష్కారం లభిస్తుందా? వంటి ప్రశ్నలకు కాలమే జవాబు చెప్పాలి.

# జ్ఞాన గుళికల కాల దీపిక




**క్యాలెండర్** అంటే మన జీవిత లక్ష్యాల డెడ్ లైన్‌ను గుర్తు చేసే మార్గదర్శి! మన నిత్య కర్తవ్యాల గురించి అప్రమత్తం చేసే కాల వివరణ పట్టిక. అలాంటి క్యాలెండర్ వ్యక్తిత్వ వికాస సూత్రాలు, తాత్విక బోధనలతో ఆధ్యాత్మిక జ్ఞాన సుగంధాలను వెదజల్లుతూ మనల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేస్తే ఎలా ఉంటుంది? అలాంటి అద్భుతాన్నే 2025 సంవత్సరం క్యాలెండర్‌లో అందంగా ఆవిష్కరించింది తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్. సృష్టికర్తను తెలుసుకోవడం ఎలా? జీవిత సత్యం ఏమిటి? లాంటి అంశాలను సరళంగా అర్థమయ్యే దివ్య ఖుర్‌ఆన్ సూక్తులతో, సందర్భోచిత చిత్రాలతో వివరించింది. అల్లాహ్ దయ పొందాలంటే మనమేం చేయాలి? సజ్జనులుగా జీవితాన్ని ధన్యం చేసుకోవాలంటే ఏం చేయాలో తెలియజేసింది. భూమ్యాకాశాల సృష్టి ఎలా జరిగింది? వర్షాన్ని కురిపించేది ఎవరు? లాంటి విషయాలు తెలుసుకోవాలనుకుంటే ముందుగా అల్లాహ్ శక్తి గురించి తెలుసుకోమని చెప్పింది. అనాథలను, నిరుపేదలను ఆదరించకపోతే మనం మరణించాక మనకు ఏం జరుగుతుందో హెచ్చరించింది. ధన వ్యామోహంతో జీవిత పరమార్థాన్ని మరచిపోతే కలిగే తీవ్ర పరిణామాలను మన ముందుంచింది. మాయ మోహాలతో కూడిన ప్రపంచం మనిషికి ఒక పరీక్ష వేదిక. ఈ పరీక్షలో మనం నెగ్గి స్వర్గ ప్రవేశం పొందాలంటే ఎలాంటి జీవన మార్గాన్ని అనుసరించాలో ఈ క్యాలెండర్ వివరిస్తుంది. ఇంగ్లీష్, అరబ్బీ కాలమానాలతో కూడిన ఈ క్యాలెండర్ మనల్ని కొత్త ఏడాదిలో ధర్మ మార్గంలో ముందుకు నడిపే కాల దీపిక.

# సహనం జీవితానికి వెలుగు రేఖ

**మనిషి** జీవితంలో ఆపదలు, కష్టాలు ఎదురైనప్పుడు, ఆందోళన అలముకున్నప్పుడు సహనం ఒక్కటే వెలుగు రేఖలా ఆదుకుంటుంది. సహనం ద్వారానే మనుషులు (ముస్లింలు) తమ ఇహపర మార్గాలను సరిదిద్దుకోగలరు. బాధ్యతల నుండి పారిపోని ధైర్యాన్ని, ఫలితాల కోసం ఎదురు చూడకుండా ముందుకు సాగిపోయే మొక్కవోని ధీరత్వాన్ని సహనం అందిస్తుంది. సహనంతోనే జీవిత కార్యాలను నెరవేర్చుకొని, అపజయాలను ఎదుర్కోగలరు. బాధలు, కష్టాలు మనిషిని పరీక్షించినప్పుడు సహనంతో నిరంతరం శ్రమించాలి. అప్పుడే మన లక్ష్యాలు నెరవేరి, మన సామర్థ్యం మెరుగుపడుతుంది. సహనం పాటించే వ్యక్తికి ఆ సహనాన్నే అల్లాహ్ కానుకగా ఇస్తాడు. సహనం ఔన్నత్యానికి, పరిపూర్ణతకు, వీరత్వానికి నిదర్శనం. ఇస్లామీయ ధర్మ స్థాపన బాధ్యతను బలమైన, సామర్థ్యం కలిగిన సహనశీలి మాత్రమే నిర్వహించగలడు. జీవిత పోరాటంలో సహనాన్ని చూపిన వారికి తీర్పు దినాన ఒక పుణ్యాత్మునికి, ఒక సమాజీకి లభించిన కానుకల కంటే ఎక్కువ కానుకలు లభిస్తాయి. సహనం సత్యాన్ని పరస్పరం బోధించుకోవడానికి అవసరమైన నైజంగా ఖుర్‌ఆన్ అభివర్ణించింది. ఇస్లామీయ విధులపై స్థిరత్వాన్ని కలిగి ఉండటం సహనానికి ఉన్న ఒక రూపం. చెడుకు ఎదురు నిలిచే పోరాడే తత్వాన్ని మనిషికి సహన గుణమే అందిస్తుంది. సహనం మనిషిని పుణ్య కార్యాల వైపు నడిపిస్తుంది. పాపాల నుంచి దూరంగా ఉండటానికి సహాయపడుతుంది. సహనం ఫలితాలను పొందడానికి కొంత కాలం వేచి చూడాలి. ❖

# అమర వీరులు అష్ఫాఖ్, బిస్మిల్ స్మరణలో డిసెంబర్ 19న "ఐక్యతా దినోత్సవం" జరుపుకుందాం





## చరిత్రకారుడు నశీర్ అహమ్మద్ పిలుపు

**భారతీయ విప్లవకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు పండిత రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ స్మరణలో డిసెంబర్ 19న ''ఐక్యతా దినోత్సవం'' జరపాల్సిందిగా ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ ప్రజలకు పిలుపునిచ్చారు.**



ఈ మేరకు డిసెంబరు 11న ఆయనను కలసిన విలేకరులతో మాట్లాడుతూ, ఈ యోధులు ఇరువురికి బ్రిటిష్ ప్రభుత్వం ఉరిశిక్ష విధించి 1927 డిసెంబర్ 19న అమలుపర్చిందని తెలిపారు. భారత స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫాఖుల్లా ఖాన్ (1900–1927), పండిత రాంప్రసాద్ బిస్మిల్ (1897–1927)ల మధ్యన చాలా పోలికలు ఉన్నాయని నశీర్ అహమ్మద్ అన్నారు. భయమెరగని ఈ ఇరువురు విప్లకారులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షాజహాన్పూర్‌కు చెందినవారని, వీరిరువురూ షాజహాన్పూర్‌లోని "అబ్బీ రిచ్ మిషన్ ఉన్నత పాఠశాల"లో చదువుకున్నారని, అంతేకాకుండా పాఠశాలలో చదువుతున్నప్పుడే వీరికి విప్లవ భావాలు ఆలవడ్డాయని, మాతృభూమి విముక్తి పోరాటంలో పాల్గొనాలన్న నిర్ణయం మేరకు ఇరువురు మధ్యలోనే చదువు మానేశారన్నారు. అనంతరం రాంప్రసాద్, అష్ఫాఖ్ " హిందుస్థాన్ రిపబ్లిక్ ఆర్మీ" లో సభ్యులుగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సాగిన సాయుధ విప్లవోద్యమంలో భాగస్వాములయ్యారు. ప్రముఖ విప్లవకారుడు చంద్రశేఖర ఆజాద్ మార్గదర్శకంలో సాగిన బ్రిటిష్ వ్యతిరేక కార్యకలాపాలలో ఇరువురు కలసి చురుగ్గా పాల్గొన్నారు, ఆంగ్లేయ ప్రభుత్వాధినేతలను కలవరపెట్టిన "కాకొరి రైలు దోపిడీ" సంఘటనలో ఇరువురు ప్రధాన పాత్ర నిర్వహించారని నశీర్ వివరించారు. ఆ కారణంగా ఆనాటి ఆంగ్లేయ వలస ప్రభుత్వం ఈ విప్లవకారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ ఇరువురికి ఉరి శిక్ష విధించగా, ఆ శిక్ష 1927 డిసెంబర్ 19 తెల్లవారు జామున ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జైళ్ళల్లో అమల య్యాయి. పండిత రాంప్రసాద్ బిస్మిల్‌ను గోరఖ్పూర్ జైలులో, అష్ఫాఖుల్లా ఖాన్‌ను ఫైజాబాద్ జైలులో ఒకేరోజు, ఒకే సమయాన ఆంగ్ల ప్రభుత్వం ఉరిశిక్షకు గురిచేసింది. ఈ విప్లవకారుల ఇరువురు జీవిత పర్యంతం భారతీయులలో ఐక్యతకు ప్రతీకలుగా నిలిచారని, ఆనాడు ఒకరికోసం మరొకరు తమ ప్రాణాలను బలిపెట్టడానికి ఇద్దరూ పోటీ పడిన వైనానాన్ని నశీర్ అహమ్మద్ దృశ్యాత్మకంగా వివరించారు. ఐక్యతను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా డిసెంబర్ 19న "ఐక్యతా దినోత్సవం" జరుపుకుంటూ ఆ అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకుందామని నశీర్ ప్రజలకు, ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేశారు. ఈ అమరవీరుల త్యాగమయ సాహసోపేత పోరాట చరిత్ర తెలుసుకోదలచిన పాఠకులకు ఆ మహనీయుల జీవిత చరిత్రల గ్రంథాలను (పిడిఎఫ్ ఫైళ్లు) ఉచితంగా పంపగలమని ఆయన తెలిపారు. ఆసక్తిగల పాఠకులు + 91 9440241727 తో సంప్రదించాల్సిందిగా బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ అన్నారు.

నసీరా బేగం



# ఆత్మ పరిశుద్ధత

**మనిషి** మనసులో అల్లాహ్ రెండు గుణాలను ఉంచాడు. 1) మంచి 2) చెడు. ఆ తరువాత అతనికి ఆ రెండింటిలో నుంచి ఏదైనా ఎంచుకునే అధికారాన్ని కూడా ప్రసాదించాడు. అతను తన జీవిత ప్రయాణంలో ఆ రెండింటిలో నుంచి దేన్నయినా ఎంచుకోవచ్చు. ఏ మార్గంపైనైనా పయనించవచ్చు. కాని అల్లాహ్ ఏ మనిషి అయితే తన ఆత్మను పరిశుద్ధపరచుకున్నాడో మంచి వైపునకు పయనించాడో అతనే సాఫల్యాన్ని పొందు తాడు అనే విషయాన్ని కూడా తెలియజేశాడు. ఈ విషయం దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయబడింది : మానవాత్మ సాక్షిగా, ఆ ఆత్మను తీర్చిదిద్ది ఆపై దానికి సంబంధించిన మంచీ చెడులను దానికి తెలియజేసినవాడు సాక్షిగా, నిశ్చయంగా తన ఆత్మను పరిశుద్ధపరచుకున్న వ్యక్తి సఫలుడయ్యాడు, దానిని అణచివేసినవాడు విఫలుడయ్యాడు. (91: 7-10)

ఒకవేళ మనిషి తనను తాను చెడు మార్గాల నుండి తప్పించి మంచి మార్గాల వైపునకు పయనింపజేస్తే అతను ఆత్మ పరిశుద్ధత వైపునకు తన ప్రయాణాన్ని ప్రారంభించినట్లు. మనిషి తన మనసులో రేకెత్తే దుష్ట ఆలోచనలను అణచివేసి అక్కడ దైవభక్తినీ దైవ భయాన్ని నాటినట్లయితే అంటే అతను దుష్కార్యాలను విడనాడి సత్కార్యాలను చేస్తూ ఉన్నట్లయితే. దాని ఫలితంగా అల్లాహ్ అతనితో మంచిని ఉద్భవింపజేస్తాడు. దానికారణంగా అతనిలో నైతిక విలువలు పెంపొందుతాయి. అలాంటి వ్యక్తినే అల్లాహ్ తన ఆత్మను పరిశుద్ధపరచుకున్న కారణంగా అతను సాఫల్యానికి నోచుకుంటాడు అని తెలియజేశాడు. దానికి వ్యతిరేకంగా ఏ వ్యక్తి అయితే తన ఆత్మను పరిష్కరించకుండా ఇట్టే వదిలి వేస్తాడో అతను తనను తాను నష్టపరచుకున్నట్లే. ఇంకా మనిషి ఆత్మను పరిశుద్ధపరచటానికీ అల్లాహ్ ప్రవక్తలను కూడా పంపాడు.

ఈ విషయాన్ని దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; "మేము మీలో నుండే ఒకరిని ప్రవక్తగా మీ మధ్యకు పంపాము. అతను మీకు మా వాక్యాలను వినిపిస్తాడు. మీ జీవితాలను తీర్చిదిద్దుతాడు. మీకు తెలియని ఎన్నో విషయాలు నేర్పుతాడు. కనుక మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటాను. నాకు కృతజ్ఞతలు తెలపండి. చేసిన మేలును మరువకండి" (2: 151) ఇంకా దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అ) కాబా గృహ నిర్మాణం చేస్తూ మున్ముందు ఒక ప్రవక్తను పంపమని దుఆ చేస్తూ ఆ ప్రవక్తలో ఉండే గుణాలను కూడా ఈవిధంగా ప్రస్తావించారు. ఆయన దుఆ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది : "ప్రభూ! నీ వాక్యాలు వారికి వినిపించి, నీ గ్రంథాన్నీ, దివ్య జ్ఞానాన్ని వారికి బోధించి వారి జీవితాలను తీర్చిదిద్దే ఒక ప్రవక్తను స్వయంగా వారి జాతి నుండే వారిలో సృష్టించు. నీవు సాటిలేని సర్వాధికారివి. అనుపమ ప్రజ్ఞాశాలివి. (2: 129)

దివ్యఖుర్‌ఆన్‌లో ఈ వాక్యాల ద్వారా స్పష్టమయ్యే విషయమేమిటంటే, ప్రజల ఆత్మలను పరిశుద్ధపరచి, వారి జీవితాలను తీర్చిదిద్దటమే ప్రవక్తలందరి ముఖ్యమైన కర్తవ్యం. వారికి దైవానికి సమీపం చెయ్యటం, వారికి దైవభక్తిని అలవాటు చెయ్యటమే వారి ముఖ్య ఉద్దేశం.

ఆత్మను పరిశుద్ధపరచుకునేందుకు ముఖ్యంగా మూడు అంశాలను మనిషి జ్ఞాపకం ఉంచుకోవాలి.

1) జ్ఞాన పరిశుద్ధత 2) సంకల్ప పరిశుద్ధత 3) ఆచరణల పరిశుద్ధత

మొట్టమొదట జ్ఞానాన్ని పరిశుద్ధపరచుకోవటం అంటే మనిషి తన జ్ఞానాన్ని సరైన దిశలో పయనింపజేస్తూ సృష్టికర్తను గుర్తించాలి. సర్వ సృష్టికర్తనే ఆరాధించాలి. ఆయన ఆజ్ఞలనే పాలించాలి. ఆయన ముందే శిరసావహించాలి. సృష్టితాలను గానీ, ఇతర ఎలాంటి శక్తులను గానీ అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పించకూడదు. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయటం జరిగింది. "ప్రతి వస్తువునూ సృష్టించినవాడు అల్లాహ్‌యే. ప్రతి వస్తువుకూ

సంరక్షకుడు కూడా ఆయనే. భూమిలో, ఆకాశాలలో ఉన్న నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి". (39: 61,62) మనిషి సుదీర్ఘంగా ఆలోచించినప్పుడే జ్ఞానద్వారాలు తెరచు కుంటాయి. మార్గదర్శకత్వం లభిస్తుంది.

రెండోది; సంకల్ప పరిశుద్ధత. అంటే అతను ఏది సంకల్పించు కున్నా అది కేవలం అల్లాహ్ కోసమే అయి ఉండాలి. మనిషికి ఆచరణల ప్రతిఫలం అతని సంకల్పం ఆధారంగానే ప్రసాదించ బడుతుంది అని స్పష్టంగా తెలియజేయబడింది. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవీయబడింది. "వారు అల్లాహ్‌కు దాస్యం చెయ్యాలని, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని ఆదేశించటం జరిగింది" (98: 5) సంకల్పం అనేది హృదయానికి సంబంధించినది. మనిషి గనక పూర్తి ఏకాగ్రతతో అల్లాహ్ దాస్యం గనక చేసినట్లయితే అతను ప్రతి భయం నుండి బయటపడతాడు. అతనికి ఉపాధి భయమూ ఉండదు. మరణ భయమూ ఉండదు, కష్ట భయమూ ఉండదు. నష్ట భయమూ ఉండదు. అతను ఏది చేసినా, అతనికి ఏమి జరిగినా కేవలం పరలోకంలో అల్లాహ్‌తో తప్పకుండా దాని ప్రతిఫలం పొందుతాననే ఆశను కలిగి ఉంటాడు.

మూడోది; ఆచరణల పరిశుద్ధత. అంటే మనిషి కేవలం ఆచరణలు అల్లాహ్ భయంతోనో లేక కేవలం ప్రతిఫలాపేక్షతోనో చెయ్యటం కాదు. కేవలం అల్లాహ్‌నే ప్రేమించాలి. ప్రతి పని ఆయన ప్రేమలోనే చెయ్యాలి. ఎవరితో మిత్రత్వం చేసినా, ఎవరితో శత్రుత్వం చేసినా, ఎవరికి ఇచ్చినా, ఎవరికి ఇవ్వకుండా ఆగిపోయినా కేవలం అల్లాహ్ ప్రేమ పొందటం కోసమే అయి ఉండాలి. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : ఎవడైతే కేవలం అల్లాహ్ కోసమే ప్రేమించాడో, కేవలం అల్లాహ్ కోసమే శత్రుత్వం చేశాడో, ఇంకా అల్లాహ్ కోసమే ఇచ్చాడో, అల్లాహ్ కోసమే ఇవ్వకుండా ఉండి పోయాడో అతను తన విశ్వాసాన్ని పరిపూర్ణం చేసినట్టు అని.

ప్రతి వస్తువును పరిశుభ్రపరచినట్లే లేదా అంతకంటే ఎక్కువగానే మనిషి ఆత్మ పరిశుద్ధత కార్యాన్ని చేపడుతూ ఉండాలి. ఇనుముకు తుప్పు పట్టినట్టే మనిషి పాపాల కారణంగానే అతని ఆత్మకు కూడా తుప్పు పడుతుంది అని తెలియజేయబడింది. మనిషి ఆత్మ తుప్పు పట్ల జాగరూకతగా ఉండాలి. దాని పరిశుద్ధతా కార్యాలు చేపడుతూ ఉండాలి. సర్వసృష్టిపై ఆలోచనా దృష్టిని కలిగి ఉండాలి. సర్వసృష్టినీ కేవలం అల్లాహ్ తన కోసమే సృష్టించిన విషయాన్ని గ్రహించాలి. దానికి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. దివ్యఖుర్ఆన్‌లో ఇలా సెలవీయటం జరిగింది. భూమి, ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారున్నూ అయిన వివేకవంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి. వారు అప్రయత్నంగా ఇలా అంటారు; ప్రభూ! ఇదంతా నీవు వ్యర్థంగా, లక్ష్యరహితంగా సృష్టించలేదు. నీవు పరిశుద్ధుడవు కాబట్టి నిష్ఫల కార్యాలు చెయ్యవు. (3: 191)

ఇంకా మనిషి తనను తాను గుర్తించాలి. అల్లాహ్ అతన్ని భూమిపై అతన్ని ఖలీఫాగా పుట్టించాడు. మనిషి తన బాధ్యతను గుర్తించాలి. ఎవడైతే తనను తాను గుర్తిస్తాడో, అతను అల్లాహ్‌ను కూడా గుర్తిస్తాడు. అతని బాధ్యతలను కూడా గుర్తిస్తాడు.

ఇంకా మనిషి దివ్య గ్రంథాన్ని వివేక దృష్టితో పారాయణం చేస్తూ ఉండాలి. దైవప్రవక్త(స) గారి కాలంలో వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ ఆయన(స) గారి అనుచరులు పారాయణం చేస్తూ ఉండేవారు. దివ్యగ్రంథ పారాయణం ద్వారా హృదయాలపై పడి ఉన్న తాళాలు తెరచుకుంటాయి.

అంతేకాదు, దైవగ్రంథ పారాయణంతోపాటు దైవప్రవక్త(స) గారి సూక్తులను కూడా అధ్యయనం చేస్తూ ఉండాలి. ఈ రెండు ఎలాంటి దీపాలంటే వీటి కాంతిలో మనిషి తన పూర్తి జీవితాన్ని చక్కదిద్దుకోగలుగుతాడు. దైవప్రవక్త(స) పరమపదించే సమయంలో ప్రజలకు హితబోధ చేస్తూ ఇలా సెలవిచ్చారు; "నేను మీ మధ్యన రెండు వస్తువులను విడిచిపెట్టి వెళుతున్నాను. ఎవరైతే దీనిని దృఢంగా పట్టుకున్నారో వారు ఎలాంటి మార్గభ్రష్టత్వానికి గురికారు. 1) దివ్య ఖుర్ఆన్ 2) హదీసు."

ఇంకా దానితోపాటు ఫర్జ్ దైవారాధనలు తప్పకుండా చెయ్యాలి. దానితోపాటు నఫిల్ అదనపు ఆరాధనలు కూడా తప్పకుండా చెయ్యాలి. అల్లాహ్ పవిత్ర నామాలను ఎల్లప్పుడూ స్మరిస్తూనే ఉండాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "విశ్వసించిన ఓ మానవు లారా! అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి. ఉదయం, సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండండి. ఆయనే మీపై కరుణచూపేవాడు" (33: 44)

ఇంకా పరలోక జీవితంపై అచంచలమైన విశ్వాసం కలిగి ఉండాలి. అప్పుడే మనిషి ధర్మకార్యాలు చెయ్యగలుగుతాడు. అల్లాహ్ ప్రతిఫలం ఇవ్వటంలో అత్యంత న్యాయపరుడు. రవ్వంత కార్యాన్ని కూడా వదిలిపెట్టడు.

ఇంకా ప్రతి మనిషి ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉండాలి. అతను చేస్తున్న కార్యాలు అల్లాహ్‌కు ఇష్టమైనవా? కావా? అని. రేపటి కోసం అంటే పరలోకం కోసం నేను ఏం సిద్ధం చేసుకుంటున్నానో విశ్లేషించుకుంటూ ఉండాలి.

అంతేకాదు, తన విశ్లేషణా కార్యక్రమంలో బయటపడ్డ తన తప్పులను కప్పిపుచ్చకూడదు. దానిపై దృష్టిని కేంద్రీకరించాలి. తప్పులను సరిదిద్దుకోవాలి. జరిగిపోయిన తప్పులపై అల్లాహ్‌ను క్షమాపణలు కోరుకోవాలి.




**షిహాబ్ ఫజల్, లక్నో**

**ప్రస్తుతం** దేశమంతా ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ వైపు చూస్తోంది. అక్కడ పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించినట్టు, చట్ట దుర్వినియోగానికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు కూడా వస్తున్నాయి. ప్రజా శాంతికి భంగం కలిగించే, అల్లర్లు, దుశ్చర్యలకు దారితీసే పిటిషన్‌లను కోర్టులు ఎందుకు విచారణకు స్వీకరిస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక న్యాయస్థానం ఛందోసి (సంభల్) సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు మస్జిదు సర్వే సందర్భంగా రాళ్ల దాడి, హింస, పోలీసు కాల్పుల కారణంగా ఐదుగురు యువకులు మరణించారు. 1991 ప్రార్థనా స్థలాల చట్టం ప్రకారం ఆగస్టు 15, 1947 తర్వాత దేశంలోని ఏ ప్రార్థనా స్థలం మతపరమైన స్వభావాన్ని కూడా మార్చడానికి వీలు లేదు.

### భయం గుప్పిట్లో సంభల్

దిగువ కోర్టుల సర్వే ఆదేశాలు దేశంలో భయం, ఆందోళన, అరాచక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. చట్టాన్ని అమలు చేసేవారు కూడా ముస్లింలను 'శత్రువులుగా' చూస్తూ హింసకు పాల్పడటం, ఐదుగురు యువకుల మరణం తరువాత, షాహీ జామా మసీదు ప్రాంతంలో చాలా మంది యువకులు కనిపించడం లేదు.

న్యూస్ లాండ్రీ జర్నలిస్ట్ ఒధీష్ కుమార్ సంభల్ అల్లర్ల తర్వాత జిల్లా జాయింట్ ఆసుపత్రిలో చేరిన క్షతగాత్రులతో మాట్లాడారు. బాధితుల ఇళ్లను కూడా సందర్శించారు. గాయపడిన అజీమ్ అనే యువకుడు జర్నలిస్టుతో మాట్లాడుతూ... "అబద్ధపు వాంగ్మూలం ఇవ్వవలసి ఉంటుందని వారు (పోలీసులు) చెబుతున్నారు. పోలీసుల బుల్లెట్ తగలలేదు. గుంపు నుండి రాయి తగిలిందని చెప్పాలి. మీరు తప్పించుకోవడానికి ఒకే ఒక్క అవకాశం ఉంది, 10 మంది వ్యక్తుల గురించి ఆలోచించండి." అన్నారని తెలిపారు.

తనపై కాల్పులు జరపలేదని తన కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారని గాయపడిన మరో బాధితుడు హసన్ పేర్కొన్నాడు. క్షతగాత్రులలో ఒకరితో విలేఖరి మాట్లాడగా.. మూడు రోజులుగా ఎక్స్ రే రిపోర్టు రాలేదని తెలిసింది.

సంభల్ తహసీల్‌లో బయటి వ్యక్తుల ప్రవేశాన్ని అడ్మినిస్ట్రేషన్ ఆంక్షలు విధించినందున, విషయం పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉంది, కాబట్టి ప్రభుత్వం తనకు కావలసినది చేయగలదు. అరెస్టయిన, గాయపడిన వారిపై ఒత్తిడి తెచ్చి వ్యక్తులను ఇరికించేందుకు పోలీసులు తప్పుడు వాంగ్మూలాలు,

వేలిముద్రలు తీసుకుంటున్నట్లు బాధితుల మాటలను బట్టి స్పష్టమవుతోంది. పోలీసులు కాల్పులను కొట్టిపారేస్తున్నారు. నిష్పక్ష పాతంగా దర్యాప్తు చేస్తే నిజానిజాలు వెల్లడవుతాయి. అజీమ్ సంభాషణ వీడియోను సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేయడంతో, అజీమ్‌ను, మరొక గాయపడిన వ్యక్తిని మురాదాబాద్ మెడికల్ కాలేజీకి తరలించారు.

మృతుల్లో నయీమ్ ఘాజీ, ముహమ్మద్ బిలాల్, రుమాన్ ఖాన్, ముహమ్మద్ కైఫ్, ముహమ్మద్ అయాన్‌లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులే కాల్పులు జరిపారని అతడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముహమ్మద్ కైఫ్ అన్నయ్యను పోలీసులు ఎత్తుకెళ్లారు.

సంభల్ స్థానిక జర్నలిస్ట్ మన్వర్ తబీష్ మాట్లాడుతూ, పోలీసులు చాలా మంది టీనేజ్ అమ్మాయిలు, అబ్బాయిలను అరెస్టు చేశారని అన్నారు. వారు చట్టపరమైన సహాయం కోసం ఎదురుచూస్తున్నారు, ఈ యువకులు, మహిళలు రాళ్లదాడికి పాల్పడ్డారని పోలీసు అధికారులు ఒక వివరణాత్మక నివేదికను ప్రచురించారు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం హింసపై విచారణకు ముగ్గురు సభ్యుల జ్యుడీషియల్ కమిటీని ఏర్పాటు చేసింది, నాలుగు అంశాలపై విచారణ ప్రారంభించింది:

హింసకు కుట్ర జరిగిందా?

సహేతుకమైన పోలీసు భద్రత ఏర్పాటు చేశారా?

హింస ఏ కారణాల వల్ల, ఏ పరిస్థితులలో జరిగింది?

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే ఏం చేయాలి?

రిటైర్డ్ జడ్జి దేవేంద్ర అరోరా నేతృత్వంలోని ఈ కమిటీలో రిటైర్డ్ ఐపిఎస్ ఎకె జైన్, రిటైర్డ్ ఐఎఎస్ అమిత్ మోహన్ ఉన్నారు.

అసోషియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఏపీసీఆర్), హజ్రత్ ఖాజా ఘరీబ్ నవాజ్ అసోసియేషన్ పోలీసుల అధికార దుర్వినియోగం, దౌర్జన్యాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. బాధితులకు న్యాయం చేయాలని అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

పెద్ద ఎత్తున అరెస్టులు జరిగాయని ఏపీసీఆర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. పోలీసులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, సిట్ విచారణ ద్వారానే అసలు నిజం బయటపడుతుందన్నారు. పోలీసులపై చట్టపరమైన నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘించినట్లు అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాటిని పిటిషన్‌లో ఎత్తి చూపారు. అందుకు సాక్ష్యంగా వీడియో ఫుటేజీని ఏపీసీఆర్ సమర్పించింది.

నవంబర్ 19న సాయంత్రం కోర్టు కమిషనర్ రమేష్ రఘు సమక్షంలో మస్జిదు సర్వే ప్రశాంతంగా జరిగిందని సంభాల్ షాహీ జామియా మస్జిదు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు జాఫర్ అలీ తెలిపారు.

ఆ సమయంలో, ప్రార్థనలు చేయడానికి వచ్చిన స్థానిక పార్లమెంటు సభ్యుడు జియావుర్ రహ్మాన్ బరాక్, స్థానిక అసెంబ్లీ సభ్యుడు ఇక్బాల్ మెహమూద్ కూడా ఉన్నారు. నవంబర్ 24న మరో సర్వే అవసరం లేదని, అయితే 24న స్థానిక కోర్టు నుంచి అనుమతి తీసుకోకుండా సర్వే చేశారని, ఈ సందర్భంగా ట్యాంక్‌లో నీటిని తీసి పరిశీలించగా, పుకార్లు వ్యాపించాయని జాఫర్ అలీ తెలిపారు. ప్రజలు గుమిగూడడం ప్రారంభించారు, రాళ్ల రువ్వడం, పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం, కాల్పులు జరిపారు, ఇందులో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

నిజానిజాలు బయటకు రావాలంటే హైకోర్టు ప్రస్తుత లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని స్థానిక ఎమ్మెల్యే ఇక్బాల్ మహమూద్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీ జియా ఉర్ రెహ్మాన్ బరాక్, ఎమ్మెల్యే ఇక్బాల్ మహమూద్ కొడుకు సోహైల్ ఇక్బాల్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. జనాలను రెచ్చగొట్టి అల్లర్లు చేశారని వారిపై ఆరోపణలు ఉన్నాయి.

అడ్వకేట్ జాఫర్ అలీపై కూడా పోలీసులు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించారు. మొత్తం విషయం గురించి ఆయన మీడియాతో


యువతరానికి విప్లవనాదం
చేతన వాదం

సహజీవన భావనల సొపురాయి
గీటురాయి
వారపత్రిక

మాట్లాడుతుండగా, పోలీసులు ఆయనను విలేకరుల సమావేశం నుంచి లేపి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కొన్ని గంటల తర్వాత విడుదల చేశారు.

సంభల్‌లో ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా అల్లర్లు సృష్టించిందని రాష్ట్రీయ శోషిత్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు స్వామి ప్రసాద్ మౌర్య అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలు వంటి ప్రాథమిక సమస్యలను పక్కదోవ పట్టించేందుకు ప్రభుత్వం అల్లర్లను ప్రారంభించిం దన్నారు. ఇక శాంతిభద్రతలు క్షీణించడంపై చర్చ లేదు, ఈవీఎంల దుర్వినియోగం ప్రస్తావన లేదు, ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించరని ఆయన మండిపడ్డారు.

భారత దేశ చరిత్ర బౌద్ధమతానికి, బ్రాహ్మణత్వానికి మధ్య జరిగిన గొప్ప సంఘర్షణల చరిత్ర అని డా.అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ అన్నారు. హిందూ దేవాలయాల క్రింద బౌద్ధ ప్రార్థనా స్థలాలను క్లెయిమ్ చేయడం బౌద్ధులు ప్రారంభిస్తే ఏమిటని ప్రశ్నించారు.

హన్స్ రాజ్ మీనా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ, "దేశంలోని అన్ని పురాతన విగ్రహాలపై సర్వే జరగాలి." తొంభై తొమ్మిది శాతం విగ్రహాలు బుద్ధ భగవానుడివిగా మారుతాయని నేను నమ్ముతున్నాను. చరిత్రలోని సత్యాలను బయటకు తీసుకురావాల్సిన సమయం వచ్చింది." అన్నారు.

ఆకాష్ బెనర్జీ యూట్యూబ్ ఛానెల్ దేశ్ భక్తలో కూడా అదే కోణం నుండి ఒక షో చేసాడు. పాట్నా, సాంచి, మధురతో సహా అనేక ప్రదేశాలలో బుద్ధ విహారాలను కూల్చివేసి, వాటిని దేవాలయాలుగా మార్చారని చెప్పాడు.

ప్రఖ్యాత న్యాయ నిపుణుడు ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తఫా తన యూట్యూబ్ ఛానెల్‌లో సంభల్ జామియా మసీదుకు సంబంధించి 1877 నాటి కోర్టు విచారణలను వివరంగా హైలైట్ చేశారు, దీనిలో ఛీదా సింగ్ అనే పిటిషనర్ వాదనను స్థానిక కోర్టు పూర్తిగా తోసిపుచ్చింది.

1877లో న్యాయమూర్తి స్వయంగా మసీదును పరిశీలించారు. అన్ని సాక్ష్యాలను వ్యక్తిగతంగా పరిశీలించి, సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ తర్వాత, ఈ కట్టడం మసీదు అని తుది తీర్పు ఇచ్చారు.

అదేవిధంగా, చరిత్రకారుడు డాక్టర్ రుచిక శర్మ తన యూట్యూబ్ ఛానెల్‌లో జామా మస్జిదు చరిత్ర గురించి వివరంగా చర్చించారు.

సంభల్ షాహీ మస్జిదుకు దేవాలయ హోదా కోసం అప్పీల్ దాఖలు చేసిన హరిశంకర్ జైన్ న్యాయవాది, అతడి కొడుకు విష్ణు శంకర్ జైన్ గతంలో 2013లో లక్నోలోని మౌండ్ మసీదు, 2015లో తాజ్ మహల్, మధుర కృష్ణ 2020. 2021లో జ్ఞాన్ వాపి కేసులు సంబంధిత స్థానిక కోర్టులలో వేశారు.

సంభల్ షాహీ జామియా మసీదుకు సంబంధించి హరిశంకర్ జైన్ అప్పీల్‌లో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)ని కూడా పార్టీగా చేర్చారు. మసీదును ఏఎస్ఐకి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

కుట్రపూరితంగానే హింసాత్మక ఘటన జరిగిందని సంభల్ పార్లమెంట్ సభ్యుడు జియా ఉర్ రెహ్మాన్ బరాక్ అన్నారు.

పోలీసులు అక్రమ ఆయుధాలతో కాల్పులు జరిపారని చెప్పారు. మొత్తం ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగేలా ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న జిల్లా, పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని బరాక్ డిమాండ్ చేశారు.

జిల్లా అధికారులు సంభల్‌లో భీభత్సం సృష్టిస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌గోపాల్ యాదవ్ అన్నారు. సిబ్బందిని బదిలీ చేయాలని అన్నారు. ఎస్పీ, డీఎంలను తొలగించాలి. బాధ్యులైన పోలీస్ సర్కిల్ అధికారిని కూడా అక్కడి నుంచి తప్పించాలి.

కైరానా పార్లమెంటు సభ్యురాలు ఇక్రా హసన్ మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కాల్పులు జరిపిందని, గుంపును ఆపడానికి సహేతుకమైన ఏర్పాట్లు చేయలేదని అన్నారు. సర్వే బృందంతో నినాదాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్న ఉన్న వ్యక్తులు ఎవరని, వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఇక్రా హసన్ ప్రశ్నించారు.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన

సహజీవన భావనల సావురాయి
గీటురాయి
వారపత్రిక

ప్రార్థనా స్థలాల చట్టం, 1991 రాజ్యాంగబద్ధతను నిర్ధారించాలని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అబ్దుల్ హఫీజ్ గాంధీ సుప్రీం కోర్టును కోరారు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే హింసకు పాల్పడిందని, దీని వెనుక కుట్ర దాగి ఉందని యూపీ మాజీ డీజీపీ విభూతి నారాయణ్ రాయ్ అన్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని ఏ పౌరుడు కూడా సురక్షితంగా లేడని యూపీ లోని సంభల్‌లో జరిగిన సంఘటనలు తెలియజేస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ తన ప్రకటనలో పేర్కొంది.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, న్యాయవ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమైన ప్రవర్తనే హింసకు కారణమని కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి షా నవాజ్ ఆలం అన్నారు. సివిల్ జడ్జిల సర్వే ఉత్తర్వులు చట్ట విరుద్ధమని, రాజ్యాంగానికి బదులు బీజేపీ ప్రభుత్వ సూచనల మేరకే వ్యవహరిస్తున్నారని అన్నారు.

ప్రార్థనాస్థలాల చట్టం 1991కి సంబంధించి డిసెంబర్ 6వ తేదీ నుంచి పదహారు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ చట్టం ప్రాముఖ్యతను ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన ప్రచారం నిర్వహించనున్నట్లు షా నవాజ్ ఆలం తెలిపారు.

ప్రార్థనా స్థలాల సర్వే కేసులన్నింటినీ సుప్రీంకోర్టు స్వాధీనం చేసుకోవాలని, సంభల్ కోర్టులో విచారణను ఆపితే సరిపోదని బాల్‌రాజ్ మాలిక్ అన్నారు.

## ముస్లిం నాయకత్వానికి పరీక్ష

చట్టం, న్యాయ ప్రక్రియ విషయానికొస్తే, కేసును తీవ్రంగా పోరాడడం ద్వారా మాత్రమే చట్టబద్ధమైన హక్కును పొందవచ్చు. దేశంలోని మెజారిటీ హిందూ ప్రజలు ఈ దుష్ప్రభావాలను గ్రహించారు. సంభల్ దుర్ఘటన తరువాత, పెద్ద సంఖ్యలో హిందువులు 'ద్వేషపూరిత కుట్ర'లను ఖండించడమే కాకుండా ఆచరణాత్మక చర్యలను కూడా డిమాండ్ చేస్తున్నారు.

సంభల్ స్థానిక రచయిత ఒవైస్ సంభల్ తన భావాలను వ్యక్తం చేస్తూ సంభల్ ముస్లింలకు మార్గదర్శకత్వం, ఓదార్పు అవసరమని అన్నారు. అత్యవసర సమయాల్లో నాయకత్వం కనుమరుగైపోకుండా దృఢంగా నిలబడి ప్రజలకు అన్ని విధాలా సాయం చేయాలన్నారు.

ఒక వ్యక్తి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో "1984లో జరిగిన అల్లర్ల నుండి సిక్కులు ఏమి నేర్చుకున్నారో, బహుశా వేలాది అల్లర్ల తర్వాత కూడా ముస్లింలు నేర్చుకోలేకపోతున్నారు" అని పేర్కొన్నారు. సిక్కులు రాజకీయాల ద్వారా ఈ సమస్యను పరిష్కరించలేదు కానీ చట్టంతో పోరాడారు. సామాజిక సేవా మార్గాన్ని ఎంచుకున్నారు.

అన్ని సమస్యలకు పరిష్కారం రాజకీయాల్లో లేదు ఎందుకంటే రాజకీయాలు బలహీనపడిన ప్రజలకు ఎప్పుడూ న్యాయం చేయవు, కాబట్టి మీ న్యాయవాదుల బృందాన్ని సిద్ధం చేయండి. సామాజిక సేవారంగంలో ముస్లింలు వెనుకబడి లేరని, అయితే దీని పరిధిని మరింత విస్తృతం చేయాలన్నారు. ముస్లింలు న్యాయబద్ధంగా పోరాడాలి. సామాజికంగా పేద, బలహీనమైన ముస్లింలలో అవగాహన కల్పించడానికి న్యాయనిపుణుల బృందాన్ని తయారు చేయాలి.

## జమాఅతె ఇస్లామీ హింద్ ప్రతినిధి బృందం సందర్శన

జమాఅతె ఇస్లామీ హింద్ ప్రతినిధి బృందం సంభల్‌ను సందర్శించి సంఘీభావాన్ని తెలియజేస్తూ బాధితులను కలుసుకుంది. ప్రతినిధి బృందం నవంబర్ 24న ఏం జరిగింది అనే వివరాలను తెలుసు కున్నారు. బాధిత కుటుంబాలను కలిసి వారికి తామున్నామని భరోసా ఇచ్చారు. న్యాయవాదులను కూడా కలుసుకుంది. ప్రతినిధి బృందం మస్జిదు కొత్త కమిటీ, కొంతమంది మాజీ కమిటీ సభ్యులతో కూడా సమావేశమైంది. జాతీయ వ్యవహారాల కార్యదర్శి షఫీ మదనీ నేతృత్వంలోని ప్రతినిధి బృందానికి, యూపీ మగ్రిబ్ అమీర్ జమీరుల్ హసన్ ఫలాహి, వాసిక్ నదీమ్, ఇనాముర్ రెహ్మాన్, ముహమ్మద్ సల్మాన్ లు ప్రతినిధి బృందంలో ఉన్నారు.

మరోవైపు సంభల్‌లోని షాహీ జామె మసీదులో సర్వే నెపంతో ఐదుగురు అమాయక ముస్లిం యువకులను యూపీ పోలీసులు కాల్చి చంపిన తీరు అత్యంత విషాదకరమని ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం ఆర్గనైజేషన్స్ ఆల్ ఇండియా ముస్లిం మజ్లిస్ కన్సల్ట్ పేర్కొంది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని అధ్యక్షుడు వసరత్ ఫిరోజ్ అహ్మద్ అడ్వకేట్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు, కిందిస్థాయి న్యాయస్థానాలు కూడా ద్వంద్వ నీతిని అవలంబిస్తున్నాయని, దీంతో దేశంలో, రాష్ట్రంలోని న్యాయ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు.

**(దావత్ పత్రిక సౌజన్యంతో...)**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**59 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 44. అద్ దుఖాన్

26-33 ఎన్నెన్నో విలాస వస్తువులు, వారు మజాలు జుర్రుకుంటూ ఉన్నవి, వారి వెనకాల ఇట్టే ఉండిపోయాయి, ఇదీ జరిగిన వారి పరిణామం, మరి మేము ఇతరుల్ని వీటినన్నింటికీ వారసులుగా చేశాము.[24] ఆపైన ఆకాశమూ వారికై విలపించలేదు, భూమీ ఏడ్వలేదు,[25] వారికి ఏమాత్రం వ్యవధి నివ్వడం జరగలేదు. ఈ విధంగా బనీ ఇస్రాయీల్‌ని మేము తీవ్ర పరాభవపూర్వకమయిన యాతన నుండి, ఫిర్ఔన్ బారి నుండి విముక్తిని కలిగించాము. ఇతను, హద్దులన్నీ అతిక్రమించినవారిలో వాస్తవంగా పెద్ద స్థానం గల వ్యక్తి; [27] వారి స్థితి తెలిసీ వారికి ప్రపంచంలోని ఇతర జాతులపైన ప్రాధాన్యత నిచ్చాము,[28] వారికి చూపించిన నిదర్శనాలలో విస్పష్టమయిన పరీక్షా ఉండింది.

24. హజ్రత్ హసన్ బస్రీ ప్రకారం వీరు బనీ ఇస్రాయీల్. వీరిని అల్లాహ్ ఫిర్ఔన్ జాతి తరువాత ఈజిప్ట్ భూభాగానికి వారసులుగా చేశాడు. కతాద ప్రకారం ఫిర్ఔన్ ప్రజల తరువాత ఈజిప్ట్ వారసులయిన ఇతర ప్రజలు. ఎందుకంటే ఈజిప్ట్ నుండి వెళ్ళిపోయిన తరువాత బనీ ఇస్రాయీల్ మరెప్పుడయినా తిరిగి అక్కడికి వెళ్ళినట్లు, ఈ భూభాగానికి వారసులయినట్లు చరిత్ర గ్రంథాల్లో దాఖలాలు లేవు. ఈ భేదాభిప్రాయం తరువాతి వ్యాఖ్యాతల్లోనూ కానవస్తుంది (సవివరమయిన చర్చకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.5, అష్ షు'అరా: పాదసూచి 45).

25. అంటే, వారు పాలకులయి ఉన్నప్పుడు వారి ఘనత నగారాలు మోగేవి. వారి ప్రశంసా గానాలతో ప్రపంచం మారుమోగుతూ ఉండేది. వందిమాగధుల బృందాలు వారి వెనకా ముందు కానవచ్చేవి. వారిని గురించి చేసే ప్రచారాన్ని బట్టి జగమంతా వారి వైశిష్ట్యాని కొనియాడుతూ పడిచచ్చేదన్నట్టు, లోకం అంతా వారి ఉపకారాలకు రుణపడి ఉన్నట్లు, ప్రపంచంలో వారిని మించిన ఖ్యాతి గడించిన వారు మరెవరూ లేనట్లు వాతావరణం కానవచ్చేది. కాని వారు పతనమయిన తరువాత వారి కోసం కన్నీరు కార్చేవారు ఒక్కరూ లేకపోయారు. నిజానికి ప్రపంచం తృప్తితో ఊపిరి పీల్చుకుంది, పక్కలో గుచ్చుకున్న ముల్లు తొలిగిపోయినట్లు అనుభూతి చెందింది. వారు దైవ సృష్టి మానవులకు చేసిన మేలూ ఏదీ లేదు, భూవాసులు వారి కోసం వగచడానికి. దైవ ప్రసన్నతకోసమూ ఎటువంటి కార్యమూ చేయలేదు, దివి నుండే వారు వారి సంహారానికి విచారపడటానికి. దైవ నిర్ణయం మేరకు వారికి గడువు త్రాడు వదులు అవుతూ పొడిగించబడినంత కాలం వారు భూమి గుండెల్లో కాష్ఠం కాలుస్తూ ఉన్నారు. వారి అపరాధాలు హద్దులు మీరినప్పుడు, చెత్తాచెదారంలా పారవేయబడ్డారు.

26. అంటే, ఫిర్ఔన్ స్వయంగానే వారి కోసం పరాభవ, పరాధీనతా శిక్షగా ఆవహించి ఉండేవాడు. మిగతా ఇతర శిక్షలన్నీ ఆ ఒక్క మూర్తీభవించిన శిక్షకు శాఖోపశాఖలు మాత్రమే.

27. ఇందులో ఒక సూక్ష్మమయిన ఎత్తి పొడుపు ఉంది- కురైష్‌లోని తిరస్కారుల నాయకులపైన. భావం ఏమిటంటే, దాస్య పరిమితులను ఉల్లంఘించిపోయే వారిలో అసలు మీ స్థానం, స్థాయి ఏమున్నాయని మహా మహులయిన తిరుగుబాటుదారుల్లో ఉన్నతుడయినవాడయితే ఆ సమయంలో ప్రపంచంలోని అతి పెద్ద సామ్రాజ్య సింహాసనంపై దైవం రూపు ధరించి కూర్చున్నాడు. అటువంటివాడినే గడ్డిపోచ నీట కొట్టుకుపోయేలా చేయడం జరిగింది. మీ అస్తిత్వానికి విలువేముందనీ, దైవాగ్రహం సమక్షంలో నిలువగలగటానికి?

28. అంటే, బనీ ఇస్రాయీల్‌లోని సుగుణాలు, అవగుణాలూ రెండూ అల్లాహ్‌కు బహిర్గతమే. ఆయన చూడకుండా పరిశీలించకుండానే కళ్ళు మూసుకుని వారిని ఎన్నుకోలేదు. ఆ కాలంలో ప్రపంచంలో ఉన్న జాతుల్లోకెల్లా ఆ జాతిని తన సందేశం ఇవ్వడానికి తన ఏకత్వం (తౌహీద్) సందేశ ధ్వజ వాహికగా ఎన్నుకున్నాడంటే, దానికి కారణం, ఆయన జ్ఞానం ప్రకారం అప్పటి జాతుల్లోకెల్లా ఇదే అత్యంత సముచితమయిన జాతి కావడం.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
**(కితాబుల్ మగాజీ)**

## మహనీయుల బాట

**122)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఆధారంగా ఉర్వా ఉటంకించారు: దైవప్రవక్త(సఅసమ్) పుత్రిక హజ్రత్ ఫాతిమా(ర.అ) అబూ బకర్ సిద్దీఖ్ (రజి) దగ్గరకు ఎవరినో పంపించి, తనకు రావలసిన వారసత్వ హక్కు ఇప్పించమని కోరారు. అంటే అల్లాహ్ తన ప్రవక్త(స)కు మదీనాలో, ఫదక్‌లో ప్రసాదించిన ఆస్తిలోనుంచి, ఖైబర్‌లోని అయిదవ భాగం (ఖుముస్)లోనుంచి తన వాటా ఇవ్వమని అడిగించారు. దానికి సమాధానంగా అబూబక్ర్(రజి) ఇలా అన్నారు: "ప్రవక్తలమైన మాకు ఆస్తి అంటూ ఏదీ ఉండదు. మేము ఏది వదలిపోయినా అదంతా 'సదఖా'(దానం) అవుతుంది. కాకపోతే ముహమ్మద్(స) కుటుంబీకులు దానినుండి లబ్ది పొందుతూ ఉంటారు" అని దైవప్రవక్త(స) స్వయంగా ఉపదేశించారు. నేను దైవసాక్షిగా చెబుతున్నాను- దైవప్రవక్త (సఅసమ్) విడిచిపోయిన 'సదఖా'లో నేను ఎలాంటి పరివర్తన చేయజాలను. దైవప్రవక్త(స) కాలంలో అది ఎలా ఉండేదో ఇప్పుడూ అది అదే స్థితిలో ఉంటుంది. అందులో (దాని పంపకం విషయంలో) దైవప్రవక్త(స) తన జీవిత కాలంలో అవలంబించిన పద్ధతినే నేనూ అవలంబిస్తాను".

ఆ విధంగా అబూ బకర్(రజి) ఫాతిమా (ర.అ)కు వారసత్వం రూపేణా ఏమీ ఇవ్వలేదు. తత్కారణంగా ఫాతిమా(ర.అ) అబూ బకర్ (రజి) పట్ల కినుక వహించారు. ఆయనతో గల సాధారణ సంబంధాలను త్రెంచుకున్నారు. మరణ కాలం వరకూ ఆమె గారు అబూబక్ర్‌తో మాట్లాడలేదు.

హజ్రత్ ఫాతిమా(ర.అ) దైవప్రవక్త(స) పరమపదించిన తర్వాత కేవలం ఆరు నెలలు మాత్రమే జీవించి ఉన్నారు. ఆమె మరణించినప్పుడు ఆమె భర్త అలీ(రజి) రాత్రి పూట ఆమె అంతిమ సంస్కారం జరిపారు.[1] అబూబకర్(రజి)కు కూడా ఆ సమాచారం చేరవేయకుండా తాను స్వయంగా నమాజె జనాజా చేయించారు.[2] ఫాతిమా(ర.అ) జీవించి ఉన్నంతకాలం ప్రజలు హజ్రత్ అలీ(రజి) బాగోగుల పట్ల శ్రద్ధ కనబరిచేవారు. కాని ఫాతిమా(ర.అ) కాలం చేసిన తరువాత జనులు తన పట్ల ముఖావంగా ఉన్నట్లు అలీ(రజి) పసిగట్టారు. ఆ సమయంలో ఆయన మహనీయ అబూ బకర్(రజి)తో సంధి చేసుకుని, ఆయన సమక్షంలో విధేయతా ప్రమాణం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. అప్పటికి అబూబక్ర్(రజి) ఖలీఫాగా బాధ్యతలు స్వీకరించి ఆర్నెల్లు గడిచినా అబూబకర్(రజి) సమక్షంలో ఆయన విధేయతా ప్రమాణం (బయ్‌అత్) చేయలేదు.[3]

ఎట్టకేలకు ఆయన అబూబకర్‌ను పిలువనంపారు. తన దగ్గరకు ఒంటరిగా రావాలని, వేరెవరినీ వెంటబెట్టుకుని రాకూడదని కబురంపారు. ఉమర్(రజి) ఆయన వెంట రావటం అలీ(రజి)కి ఇష్టంలేదు.[4] 'దైవసాక్షిగా! ఎట్టి పరిస్థితిలోనూ అక్కడికి వెళ్ళవద్ద'ని ఉమర్(రజి) అబూబకర్(రజి)కు సలహా ఇచ్చారు.[5] దానికి అబూబకర్(రజి) "ఎందుకు? ఒంటరిగా వెళితే ఏమవుతుంది? దైవసాక్షిగా చెబుతున్నాను- నేను ఒంటరిగానే వెళతాను" అన్నారు.

అన్నట్లే ఆయన అలీ(రజి) దగ్గరకు వెళ్ళారు. అలీ(రజి) అల్లాహ్‌ను సాక్షిగా పెట్టి ఇలా అన్నారు: 'అల్లాహ్ మీకు వొసగిన గౌరవాన్ని, మీకు ప్రసాదించిన అనుగ్రహ భాగ్యాలను, మీకు వొసగిన మేలును, విశిష్టతను మేము అంగీకరిస్తున్నాము. ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావులేదు. కాని మీరు మా పట్ల అతిగా వ్యవహరించారు (ఖిలాఫత్ వ్యవహారంలో మమ్మల్ని కనీసం సంప్రతించనయినా లేదు). దైవప్రవక్త(స)తో మాకు గల బంధుత్వ సంబంధం

దృష్ట్యా మీరు మమ్మల్ని సంప్రతించి ఉండాల్సిందన్నది మా భావన’.

ఈ మాటలు విని అబూబకర్(రజి) తల్లడిల్లిపోయారు. దాదాపు స్పృహ కోల్పోయారు. మాట్లాడగలిగే స్థితిలోకి వచ్చాక ఇలా అన్నారు: “ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ దేవుని సాక్షిగా! దైవప్రవక్త(స) బంధువుల పట్ల సద్భావనతో మెలగటమనేది నాకు నా బంధువుల పట్ల సద్వ్యవహారం చేయటం కన్నా ప్రియమైనది. కాని నాకూ – మీ పరివారానికి మధ్యన ఏ ఆస్తిపాస్తుల విషయంలో అభిప్రాయ భేదం వచ్చిందో అందులో నేను సత్యం నుండి, మంచి నుండి వైదొలగ లేదు. ఈ వ్యవహారంలో దైవప్రవక్త(స) ఏ మార్గాన్ని అవలంబించగా నేను గమనించానో, సరిగ్గా ఆ మార్గాన్నే నేనూ అవలంబించాను.”

ఈ సంభాషణ ముగిసిన తరువాత అలీ (రజి) అబూ బక్ర్(రజి)తో, ‘మధ్యాహ్నం తరువాత నేను మీ సమక్షంలో విధేయతా ప్రమాణం (బయ్అత్) చేస్తాను’ అన్నారు. మహనీయ అబూబకర్(రజి) జుహ్ర్ నమాజ్ అనంతరం వేదిక (మింబర్)పైకి వచ్చి, క్లుప్తంగా ప్రసంగించారు. తరువాత మహనీయ అలీ(రజి) వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఇప్పటివరకూ ఆయన విధేయతా ప్రమాణం చేయకుండా ఉండటానికి గల కారణం కూడా వివరించారు. పిదప హజ్రత్ అలీ(రజి) ‘ఇస్తిగ్ఫార్’ చేసి, తషహ్హుద్ పఠించి, ఆ పైన అబూ బకర్(రజి) త్యాగనిరతిని, ప్రత్యేకతలను విశదీకరించారు. ఆ తర్వాత ఇలా అన్నారు: ఏదయితే నేను అబూబకర్ (రజి) గురించి అభిప్రాయపడ్డానో, దాని మూలంగా ఆయన పట్ల మాకు ఎలాంటి అసూయ లేదు. అల్లాహ్ ఆయనకు ప్రసాదించిన గౌరవోన్నతులను (ఖిలాఫత్‌ను) కాదనటం కూడా మా ఉద్దేశం కాదు. కాకపోతే మా అభ్యంతరమల్లా ఒక్కటే– ఖిలాఫత్ వ్యవహారంలో మమ్మల్ని సంప్రతించి, మా అభిప్రాయం కూడా తెలుసుకోవాల్సింది. ఈ వ్యవహారంలో మేము ఉపేక్షించబడ్డాము. అది మాకు ఆవేదనను మిగిల్చింది. అలీ(రజి) మనోవేదనను విని ముస్లింలు స్వాగతించారు, మీరు చెప్పేది సమంజసం అంటూ హర్షం వెలిబుచ్చారు. ఈ సంఘటన తర్వాత ముస్లింలు మహనీయ అలీ(రజి) పట్ల మరింత ప్రేమాదరణలతో మెలగసాగారు.[6]

122-1. ఎందుకంటే తనను రాత్రిపూట ఖననం చేయవలసిందిగా హజ్రత్ ఫాతిమా(ర.అ) వసీయతు చేసి ఉన్నారు. రాత్రి సమయంలో అంతిమ సంస్కారం జరిగినట్లయితే మరింత బాగా పరదా పాటించి నట్లవుతుందన్నది ఆమె అభిప్రాయమై ఉండవచ్చు.

122-2. ఆమె నమాజె జనాజాకు హజ్రత్ అబ్బాస్(రజి) సారథ్యం వహించారని మరికొందరు పేర్కొన్నారు.

122-3. అలీ(రజి)తోపాటు బనీ హాషిమ్‌కు చెందినవారెవరూ ‘బయ్అత్’ చేయలేదు. ఎందుకంటే అబూబకర్ సిద్దీఖ్(రజి) ఖిలాఫత్‌ను వారు సమంజసమైనదిగా భావించలేదు. తామంతా దైవ ప్రవక్త(స) మరణ శోకంలో ఉండగా తమను కనీసం మాట వరుసకు కూడా సంప్రతించకుండా వారసుణ్ణి ఎంపిక చేసుకోవటం అన్యాయం అన్నది వారి వాదన.

ఇదిలా ఉండగా ఆరుమాసాల పాటు హజ్రత్ అలీ(రజి) ‘బయ్అత్’ చేయకుండా ఉండటానికి గల కారణాలలో ఒకటేమంటే, దైవ ప్రవక్త(స) పరమపదించిన తరువాత హజ్రత్ ఫాతిమా(ర.అ) ఆరోగ్యం బాగా క్షీణించింది. ఆమెను ఓదార్చటం, పరామర్శించటం, సపర్యలు చేయటం వంటి పనులతో మహనీయ అలీ(రజి)కి తీరిక లేకుండా పోయింది.

122-4. ఎందుకంటే హజ్రత్ ఉమర్(రజి)ది కరకు స్వభావం. ఆయన రావటం వల్ల వ్యవహారం బెడిసికొడుతుందేమోనని అలీ (రజి) భావించారు.

122-5. అప్పటికే బనూ హాషిమ్ ప్రజలలో అబూబక్ర్ (రజి) పట్ల అసమ్మతి పెరగటం వల్ల, వారంతా అబూబక్ర్(రజి) పట్ల మర్యాదగా మాట్లాడరేమోనని ఉమర్(రజి) అనుమానించారు.

122-6. మహనీయ అలీ(రజి) ఎంతో విజ్ఞతతో, దూరదృష్టితో వ్యవహరించారు. అదే సమయంలో ఆయన తన మనసులోని మాటను దైవగృహంలో- ప్రజల సమక్షంలో- ఎలాంటి దాపరికం లేకుండా చెప్పారు. దాంతో ప్రజల్లో ఉన్న సందేహాలన్నీ పటా పంచలై పోయాయి. హజ్రత్ అలీ(రజి) విధేయతా ప్రమాణం చేసిన మీదట బనూ హాషిమ్ వర్గం వారంతా ఆయన్ని అనుసరించారు. ఆ విధంగా అబూబకర్ సిద్దీఖ్(రజి) ఖిలాఫత్‌పై ఏకాభిప్రాయం ఏర్పడినట్లయింది. దీని తర్వాత కూడా ఎవరయినా ఆ ఖిలాఫత్ సరైనది కాదని భావిస్తే వారు ప్రవక్త ప్రియ సహచరుల(రజి)ను వ్యతిరేకించినట్లే. అలాంటి వారికి ఈ ఆయత్ కఠిన హెచ్చరికగా ఉంది. “తనకు రుజుమార్గం విశదమైనప్పటికీ ఎవడయినా ప్రవక్తకు వ్యతిరేకంగా నడుం బిగిస్తే విశ్వాసుల వైఖరిని కాక మరొకరి వైఖరిని అవలంబిస్తే అతన్ని మేము అతడు మళ్ళిన దిక్కుకే నడిపిస్తాము...” (4: 115)

‘చరితార్థులు’-2

# మధురై జమాల్ ముహమ్మద్

## (1882-1949)






68

**దక్షిణాదిలో** గొప్ప వితరణశీలిగా, విద్యా వేత్తగా, వ్యాపారవేత్తగా ఖ్యాతిగడించిన మధురై జమాల్ ముహమ్మద్ 1882 జనవరిలో జన్మించారు. ఆయన తండ్రి మౌలానా మధురై జమాల్ మొహి యుద్దీన్, తల్లి ఆయెషా బీబి. తండ్రి చర్మ పరిశ్రమలో పేరు ప్రఖ్యాతులు పొందిన అత్యంత సంపన్న వ్యాపారి. విద్యావేత్త అయిన మౌలానా జమాల్ మొహియుద్దీన్ స్వయంగా జమాలియా అరబిక్ కళాశాల స్థాపించి అరబిక్, ఉర్దూ భాషల అభివృద్ధికి, ధార్మిక విద్యా బోధనలకు తోడ్పాటు అందించారు. విద్యాభ్యాసం తరువాత మధురై జమాల్ ముహమ్మద్ తండ్రి బాటలో కుటుంబ వ్యాపారం అయినటువంటి తోళ్ళ పరిశ్రమను చేపట్టారు. ఏ కార్యక్రమం చేపట్టి నిష్ఠ-నిబద్ధతతో పూర్తిచేయగల కార్యదక్షతగల జమాల్ ముహమ్మద్ తోళ్ళ పరిశ్రమలో అగ్రగామిగా నిలిచి, 1917లో South India Skin and Hides Merchants Association ప్రప్రథమ ప్రధాన కార్యదర్శి అయ్యారు. తొలి నుండి స్వేచ్ఛా-స్వతంత్ర భావాలు కలిగిన మౌలానా జమాల్ ముహమ్మద్ జాతీయోద్యమానికి పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తూ వచ్చారు. జాతీయోద్యమానికి నిధులు సేకరణ సందర్భంగా అవసరమైనంత నగదు మొత్తాన్ని రాసుకో గలరంటూ మహాత్మాగాంధీకి బ్లాంక్ చెక్కు ఇచ్చి అందర్ని ఆశ్చర్యపర్చారు. అంగ్లేయుడు సైమన్ ప్రతిపాదించిన సంస్కరణలకు వ్యతిరేకంగా ఆరంభమైన ఉద్యమంలో ఆయన నేరుగా ప్రవేశించారు. ప్రచార కార్యక్రమాలను సమర్ధ వంతంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ, ఆగా ఖాన్, రాజాజీ తదితర స్వాతంత్ర్య సమరయోధులతో సన్ని హిత సంబంధాలు నెరపిన జమాల్ ముహమ్మద్ జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1932లో ద్వితీయ రౌండు టేబుల్ సమావేశా లకు ఆయనకు ఆహ్వానం అందింది. స్వదేశీ వస్తు ఉద్యమం, ఖద్దరు ఉద్య మాలకు ఆయన పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించడం మాత్రమే కాకుండా స్వయంగా ఖద్దరు వస్త్రా లను ధరించారు. స్వదేశీ వస్తువుల ఔన్నత్యాన్ని ప్రజలకు తెలిపేందుకు మద్రాసులో ఆయన భారీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆంగ్లేయుల ఆధిపత్యం నుండి విముక్తి కోరుతూ సాగుతున్న ఉద్యమ కార్యకలాపాలన్నిటికి జమాల్ ముహమ్మద్ ఆర్థికంగా, హార్దికంగా సహకరించడం మాత్రమే కాకుండా విద్యాభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భూరి విరాళాలు అందించారు. ఆ క్రమంలో సన్నిహిత మిత్రులు యన్.యం. ఖాజామియా రౌతార్ తో కలసి ప్రస్తుతం ‘జమాల్ ముహమ్మద్ కళాశాల’ పేరుతో విలసిల్లుతున్న విద్యాసంస్థ నిర్మాణానికి పునాదులు వేసిన మధురై జమాల్ ముహమ్మద్ 1949 నవంబర్ ఏడున కన్నుమూశారు. ✤




9440241727


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరిం చిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# ఆచరణకు ప్రాణం విశ్వాసం

- ఎస్.ఎమ్. మలిక్

**కాలం మీద ఒట్టు! వాస్తవానికి మానవుడు భారీ నష్టంలో పడి ఉన్నాడు - ఎవరయితే విశ్వాసం గ్రహించి సదాచరణ చేస్తారో ఇంకా ఒకరికొకరు సత్యాన్ని బోధిస్తూ సహనాన్నీ ఉపదేశిస్తారో వారు తప్ప. (అల్ అస్ర్. 103 : 1- 3)**

ఈ సూరాలో మానవ జీవితానికి ఆధారాన్ని ప్రతిపాదించడం జరిగింది. ఎందుకంటే జీవితం అంటే ఆచరణ తప్ప మరేముంది? ఆచరణ, నిరంతర ఆచరణ. పుట్టిన ఘడియ మొదలెట్టి చివరి శ్వాస వరకు ఆచరణ పూర్వకమయినదే ''జీవితం,'' అలా కాకపోతే,ఆచరణశూన్యమయినది మృత కళేబరం!

### ఏది ఆచరణ?

ఆ ఆచరణ ఏ విధమయినదయి ఉండాలన్నదాన్ని నిర్దిష్ట పరుస్తు న్నాయి ఇందులోని ఆయత్‌లు.

- సదాచరణ (మంచి పని, మేలయిన పని. తనకూ ఇతరులకూ మేలయినది).

- సత్యాన్నీ మంచినీ అందరికీ మేలయినదాన్నీ పరస్పరం బోధించు కోవడం.

- ఈ సన్మార్గాన ఎదురయ్యే కష్ట నష్టాలను ఓరిమితో భరించడాన్ని బోధించుకోవడం.

ఈ మూడు పనులే నిజమయిన జీవితాన్ని సూచిస్తాయి, ఇతరత్రా సర్వం మృత సమానమయినదే! అయితే ఈ సూరాలో మరో షరతు కూడా విధించడం జరిగింది. అది విశ్వాసం గ్రహించడం. ఆ మూడు పనులకు ఆధారం విశ్వాసమయి ఉండాలన్నది.

అయితే అసలు విశ్వాసం అంటే భావం ఏమిటి? దీన్ని దివ్య గ్రంథం కుర్‌ఆన్‌లో అనేక చోట్ల విశద పరచడం కూడా జరిగింది. దీన్నే పండితులు, దివ్య కుర్‌ఆన్ ఆధారంగానే, ''నోటితో అంగీకరించి హృదయంతో ధ్రువీకరించడం'' అని విశదీకరిం చారు. అదేవిధంగా ఈ సూరాలోని వచనాలు విశ్వాసానికి ఆచరణను కూడా జోడించి, విశ్వాసంతోపాటు ఎటువంటి ఆచరణ ద్వారా మానవాళి సాఫల్యాన్ని సాధించ గలదో స్పష్టపరిచాయి. దివ్య కుర్‌ఆన్ దీన్ని కూడా విపులీకరిస్తుంది:

వాస్తవానికి అల్లాహ్‌నూ ఆయన సందేశహరుణ్ణీ విశ్వసించి ఆపైన ఏమాత్రం సంశయానికి గురికాకుండా తమ ధనప్రాణాలతో దైవ మార్గంలో ఎవరు నిరంతర కృషి సలుపుతారో వారే సత్య సంధుల యినవారు. (అల్ హుజురాత్. 49 : 15)

### విశ్వాసం లేదా ఈమాన్?

ఈ ఆయత్‌ని విశదీకరిస్తూ వ్యాఖ్యాతలు చాలా విషయాలు చెప్పారు :

''విశ్వాసమన్నది వాస్తవానికి ఒక నైతిక, ఆధ్యాత్మిక ఆచరణ. అది మనోమస్తిష్కాల లోతుల్లో తన ప్రభావాన్ని అమలు పరుస్తుంది. ఇంకా మానవుని సంకల్పం, అధికారం, బుద్ధీ వివేకాలను, అంతరాత్మను - ప్రతి దాన్నీ వశపరచుకుంటుంది. అది వహీ, అంతర్ప్రేరణల ద్వారా మానవునికి విశ్వ వాస్తవికతల్ని ఎరుక

పరుస్తుంది. ఈ ఎరుక కేవలం జ్ఞానం వరకు పరిమితం కాదు. అది గట్టి నమ్మకంగా రూపొందుతుంది. ఆ తరువాత అనుమానాలు సంశయాలు అతని దరి చేరవు. అంతర్యం పైన ఎటువంటి దాడి జరిగినా అది అతని నమ్మకాన్ని కదలించ జాలదు.''

ఇటువంటి విశ్వాసమే ఇస్లామ్ మూల సిద్ధాంతం. మూల విశ్వాసం అంటే ఇదే అన్నమాట. ఈ విశ్వాసం లేదా ఈమాన్ లేదా నమ్మకంలో మూడు అంశాలు చేరి ఉన్నాయి.

- ◆ దైవం పట్ల నమ్మకం
- ◆ దైవ దౌత్యం పట్ల నమ్మకం
- ◆ పరలోకం పట్ల నమ్మకం

## 1) దైవం పట్ల నమ్మకం

కేవలం దైవం లేదా అల్లాహ్ ఉనికిని, ఆయన ఉన్నాడని అంగీకరించడం మటుకే కాదు ఆయన ఒక్క గానొక్కడు (One and Alone), ఆయనకు మరెవరూ తోడుగా లేరని, ఇంకా దైవిక గుణగణాలు సర్వం దైవంలోనే పరిపూర్ణ రూపం (in their Complete Form)లో ఉన్నాయని నమ్మడం.

మానవుడు ఆయనకే దాస్యం చేయాలి. ఎందుకంటే ఆయనే నిజ ఆరాధ్యుడు, ప్రభువు. ఆయనకే విధేయత పాటించాలి, ఆయన్నే ఆరాధించాలి. ఆయన్నే దేన్నయినా అర్థించాలి, ఆయన పైనే భరోసా పెట్టుకోవాలి.

## 2) దైవ దౌత్యం పట్ల నమ్మకం

దైవ సందేశ హరుని నమ్మడం అంటే ఆయన దైవం నియమించిన ప్రవక్త అని నమ్మడం. ఆయనే మార్గ దర్శకుడని, ఆయన చూపిన విధానం రీత్యానే దైవాదేశాలను పాటించాలని నమ్మడం.

దివ్య కుర్ఆన్ని సయితం దైవ సందేశహరుని ద్వారానే అందిన దైవ సందేశమని నమ్మడం.

మరో ముఖ్య విషయం ఏమిటంటే మానవుడు విశ్వకర్త మార్గ బోధనకు దూరంగా ఎన్నడూ మనజాలడు. ఈ మార్గ బోధన దైవం పంపిన సందేశ హరుల (Messengers) ద్వారా లభించే బోధనా గ్రంథం ద్వారా మానవాళికి సదా లభిస్తూ వచ్చింది. ఆ మార్గ బోధనకు ఆచరణ రూపం, ఆచరణీయ ఆదర్శం, నమూనా దైవ సందేశహరుల ద్వారానే ప్రాప్తం కాగలదు అని నమ్మడం.

ఈ విధంగా దేవుని ఆదేశాల నిజమయిన విశ్వసనీయమయిన ఆదర్శం దైవ ప్రవక్త జీవన చరిత ద్వారానే ప్రాప్తం అవుతుంది అని నమ్మడం. ఈ విషయాన్ని దివ్య కుర్ఆన్ ఇలా ప్రకటిస్తుంది:

> **"నిశ్చయంగా మీ కొరకు దైవ సందేశహరునిలో ఓ ఉత్తమ ఆదర్శముంది". (అల్అహ్జాబ్ 33:21)**

## 3) పరలోకం పట్ల నమ్మకం

ఇస్లామీయ విశ్వాసాల్లోని ఈ అంశాన్ని దాదాపు ప్రతి మత వర్గం నమ్ముతుంది, నాస్తికులు, భౌతిక వాదులు తప్ప. అయితే ప్రతి మత వర్గం నమ్మే ప్రామాణికత, పరిధి వేరయినది. ఇస్లామ్ ఎటువంటి పరలోక విశ్వాసాన్ని ప్రతిపాదిస్తుందో (propose), లేదా ప్రోత్సహిస్తుందో (promote) దాని ప్రకారం మానవ జీవితం ప్రస్తుత ఇహలోక జీవితంతో ముగియదు, ఆ పైన మరణానంతరం మానవుని మరో జీవితం, మరో లోకంలో ప్రారంభమవుతుంది. దాని ప్రథమ దశల్లో ఒకదాన్ని ప్రళయం, హష్ర్ అని అంటారు. అందులోనే మానవులందరికీ ప్రపంచంలో తాము చేసిన ఆచరణలన్నిటికీ జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

ఈ సమాధానాల ఆధారంగానే మానవులందరి వ్యక్తిగత ఆచరణల పరిశీలన జరుగుతుంది. ఆ పరిశీలనలో ఎవరి ఆచరణలు సవ్యమయినవిగా పుణ్యప్రదమయినవిగా నిర్ధారించ బడతాయో వారికి సుఖప్రదమయిన ప్రశాంత జీవనం ప్రాప్తమవుతుంది. మరెవరి ఆచరణలు అపసవ్యమయి, పాపభూయిష్టమయి ఉన్నట్లు తేలుతుందో ఆ దురదృష్టవంతులు నరక జ్వాలలకు ఆహుతి అవుతారు.

ఆ లోకంలో ప్రశాంతత, సుఖం అయినా లేదా యాతన, బాధ అయినా- శారీరకంగానూ ఉంటుంది ఆధ్యాత్మికంగానూ ఉంటుంది.

ఇవీ విశ్వాసంలోని మూడు అంశాలు, వాటి వివరాలు. ఇంకా ఎన్నో దిగువ అంశాలుంటాయి, అవి ఈ మూడు విశ్వాస ప్రధానమయిన అంశాలతోనూ ముడిపడి ఉంటాయి.

జనులు దైవం ఉనికినీ విశ్వసిస్తారు, పరలోకాన్నీ నమ్ముతారు కాని అసలు విషయం దైవ దౌత్యానికి సంబంధించినది. అదే

దళితుల, మహిళల ఆశల నిధి అంబుల పొది
సహజీవన భావనల పొదరాయి
గీటురాయి
వారపత్రిక

ఇస్లామ్‌ను ఇతర మత విశ్వాసాలతో వేరుగానూ, ప్రత్యేకంగానూ నిల బెడుతుంది.

### ఆచరణ ఎటువంటిదయి ఉండాలి?

విశ్వాసం తరువాత రెండవ ప్రధాన విషయం ఆచరణ. ఆచరణ అంటే ఏమిటీ? మనం ప్రారంభంలోనే చూశాము, ఆచరణ, వాస్తవానికి జీవితాన్నే నిర్వచిస్తుందనీ మూలతహ్ జీవితంలోని విభిన్న అంశాల సమాహారమే ఆచరణ అన్నదీను. ప్రాచ్య కవి ఇక్బాల్ అందువల్లనే అన్నాడు,

**అమల్ సే జిందగీ బన్తీ హై, జన్నత్ భీ జహన్నమ్ భీ**
**ఎ ఖాకీ అప్నీ ఫిత్రత్ మే న నూరీ హై న నారీ హై**

ఆచరణ ద్వారానే జీవన నిర్మాణం జరుగుతుంది, స్వర్గమూ నరకమున్నూ
మట్టి మనిషి ప్రకృతిరీత్యా జ్యోతి ప్రధానమూ కాదు అగ్ని ప్రధానమూ కాడు!

ఇంతకూ ప్రారంభంలో పేర్కొన్న సూరాలో మానవుడు భారీ నష్టాన్ని తప్పించుకునే ఏ మార్గాన్నయితే సూచించబడిందో అది-

### విశ్వాసం సదాచరణల మార్గం

కాలం మీద ఒట్టు! వాస్తవానికి మానవుడు భారీ నష్టంలో పడి ఉన్నాడు, ఎవరయితే విశ్వాసం గ్రహించి సదాచరణ చేస్తారో ఇంకా ఒకరికొకరు సత్యాన్ని బోధిస్తూ సహనాన్నీ ఉపదేశిస్తారో వారు తప్ప. (అల్ అస్ర్. 103 : 1- 3)

### అవినాభావ సంబంధం!

అలాగే దివ్య కుర్‌ఆన్‌లో ఎక్కడ సదాచరణను ప్రస్తావించడం జరిగిందో అక్కడల్లా విశ్వాసం ప్రస్తావన ఆచరణకు ముందే చెయ్యడం జరిగింది. దివ్య కుర్‌ఆన్ ప్రకారం, విశ్వాసం సదాచరణలు పరస్పరం అవినాభవ సంబంధం కలిగి ఉన్నాయి. మౌలానా మౌదూదీ విశ్వాసం - ఆచరణలను విత్తనం- చెట్టుతో పోల్చారు. దీని ద్వారా విశ్వాస స్థానం ద్యోతక మవుతోంది.

"నేలలో విత్తనం లేనంత వరకు చెట్టు మొలకెత్తడం సంభవం కాదు. మరి భూమిలో విత్తనం ఉన్నా చెట్టు మొలవక పోతే విత్తనం భూస్థాపితం అయిపోయిందన్న మాట. అందువల్లనే దివ్య కుర్‌ఆన్ లో ఎన్ని శుభ వార్తలు ప్రకటించడం జరిగిందో అవన్నీ విశ్వాసం కలిగి సదాచరణ చేసిన వారికే పరిమితమయ్యాయి."

అంటే విత్తనం నాటినా దానికి 'సద్సంకల్పం, దైవభక్తి' నీరు లభించక పోతే దానికి చెట్టు మొలకెత్తనే జాలదు.

**(మిగతా వచ్చేవారం)**

## మానవ హక్కుల నిర్మాత మహా ప్రవక్త ముహమ్మద్(స)

**అది అరేబియా ప్రాంతం.** మానవ హక్కుల్ని ఏ మాత్రం ఖాతరు చేయని కాలం. ఆడ పిల్లలు పుట్టడాన్ని చిన్నతనంగా భావించి సజీవంగా పాతిపెట్టే కాలం. చిన్న విషయాలకే కత్తులు దూసుకుని రక్తపుటేర్లు పారించే రాతి మనుషులున్న కాలం. ఆ కాలంలోనే సమస్త ప్రపంచంపై కమ్మిన అజ్ఞాన చీకట్లను చీల్చే ఒక వెలుతురు సూర్యుడు జన్మించారు. ఆయనే మానవ మహోపకారి ప్రవక్త ముహమ్మద్(స).

బాల్యంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయి, గొర్రెల కాపరిగా జీవితం ప్రారంభించిన ప్రవక్త తన ప్రేమ మార్గంతో కర్కశ మనసుల్ని జయించారు. మానవులంతా పరస్పరం సోదరులేనని బోధించి విశ్వ మానవ సోదర భావానికి బీజం వేశారు. ఇతరుల ధన, ప్రాణాలకు నష్టాన్ని కలుగజేసేవాడు నిజమైన దైవ విశ్వాసి కాజాలడని బోధించారు. ఈ భూమిపై అన్యాయఃగా చిందించబడ్డ ప్రతి నెత్తుటి బొట్టుకు అల్లాహ్ వద్ద సమాధానం చెప్పుకోవల్సి వస్తుందని హెచ్చరించారు. నల్ల జాతికి చెందిన వారిని బానిసలుగా భావించే అరబ్బు సర్దారుల జాతి వివక్షతను వ్యతిరేకించి పవిత్ర కాబా మసీదుపై నీగ్రో జాతికి చెందిన హజ్రత్ బిలాల్‌ను ఎక్కించి తొలి అజాన్ ఇప్పించి అరబ్బుల అగ్రవర్ణ మనస్తత్వాన్ని తుత్తునియలు చేశారు. ఆడపిల్ల పుట్టడం దురదృష్టంగా భావించి సజీవంగా పూడ్చే జాతిని ఆడపిల్ల పుట్టడం వరంగా భావించే జాతిగా మలిచారు. మీరు స్త్రీల హక్కుల విషయంలో దైవానికి భయపడండి. ధర్మం ప్రకారం పురుషునికి గల అన్ని హక్కులు మహిళలకూ ఉన్నాయని బోధించటమే కాక ప్రతి పురుషుడు తన ఇంట్లో ప్రవేశించే ముందు తన భార్యకు సలాం చేసి వెళ్ళాలని ఆదేశించి పురుషాహంకారాన్ని తుత్తునియలు చేశారు. ఒకరు మరొకరి హక్కుల్ని హరించరాదని పీడితుని ఆర్తనాదానికి భయపడాలని చెప్పారు. చివరికి జంతువుల హక్కులు సైతం ఉద్బోధించారు. యజమాని తన అధీనంలోని జంతువుకు కడుపు నిండా తిండి పెట్టాలని, శక్తికి మించిన భారం వేయరాదని, పని వేళల్ని నియంత్రించాలని ఆదేశించారు. ఏ వ్యక్తి ఏ వ్యక్తి నైనా అన్యాయంగా చంపితే అతను సమస్త మానవ జాతిని హత్య చేసినట్లేనని బోధించారు. చెడును చేతనైతే చేత్తో వారించు. సాధ్యం కాకపోతే నోటితో వారించు. అదీ సాధ్యం కాకపోతే కనీసం మనసులోనైనా చెడును చెడుగా భావించు అని చెప్పి మానవ హక్కులకు ఊతమిచ్చి మానవ హక్కుల నిర్మాతగా చరిత్రలో నిలిచారు మహనీయ ముహమ్మద్(స).

**– షేక్ కరీముల్లా, వినుకొండ**

# కృషితో నాస్తి దుర్భిక్షం

- సల్మాన్ హైదర్





## (ఇటుకల బట్టీలో పని నుండి వైద్య కళాశాల వరకు: సర్ఫరాజ్ స్ఫూర్తిదాయక ప్రయాణం)

**పశ్చిమ బెంగాల్**లోని తూర్పు మీదనాపూర్‌కు చెందిన 21 ఏళ్ల సర్ఫరాజ్ ఒకప్పుడు మండుతున్న ఎండలో ఇటుకలను మోసే కార్మికుడు, నేడు MBBS డిగ్రీ కోసం ప్రతిష్టాత్మకమైన నిల్ రతన్ సర్కార్ మెడికల్ కాలేజీలో ప్రవేశం పొందేందుకు చేసిన అద్భుతమైన ప్రయాణం అతని వజ్ర సంకల్పానికి అద్దం పడుతుంది.

పరిమిత ఆర్థిక వనరులు ఉన్న కుటుంబంలో పుట్టిన సర్ఫరాజ్ బాల్యం కష్టాలతోనే గడిచిపోయింది. సర్ఫరాజ్ తండ్రి, రోజువారి కూలీ. సర్ఫరాజ్‌కు బాల్యం నుండి నేషనల్ డిఫెన్స్ అకాడమీ (NDA)లో చేరాలనే కల ఉండేది.

ఒక దురదృష్టకర ప్రమాదం సర్ఫరాజ్ NDA ఆకాంక్షలను దెబ్బ తీసింది, కానీ సర్ఫరాజ్ నిరాశ చెందలేదు. ప్రభుత్వ ఆర్థిక సాయంతో సర్ఫరాజ్ కుటుంబం స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసింది. భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వైద్య ప్రవేశ పరీక్ష అయిన NEET కోసం సన్నద్ధం కావడానికి సర్ఫరాజ్ ఉచిత YouTube ట్యుటోరియల్‌లు, ఆన్‌లైన్ ఎడ్-టెక్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించాడు. స్మార్ట్‌ఫోన్ సర్ఫరాజ్‌కి లైఫ్‌లైన్‌గా మారింది.

"నేను స్మార్ట్‌ఫోన్ సహాయంతో మొదట్లో ఉచిత యూట్యూబ్ వీడియోల ద్వారా చదువుకున్నాను, ఆపై ఫీజులో రాయితీతో ఆన్‌లైన్ కోర్సులో చేరాను" అని సర్ఫరాజ్ అన్నారు.

మూడు సంవత్సరాల పాటు, సర్ఫరాజ్ కఠోరమైన శారీరక శ్రమ చేశాడు. 300 రూపాయల కూలీతో మండుతున్న ఎండలో ఇటుకలను మోసుకెళ్లడం, ఆపైన ఏడు గంటల పాటు నిరంతరాయంగా అధ్యయనం చేయడం సర్ఫరాజ్ దినచర్య.

2023లో, సర్ఫరాజ్ NEET స్కోర్ అతన్ని డెంటల్ కాలేజీకి అర్హత సాధించి పెట్టింది. అయితే అధిక ఫీజుల కారణంగా అవకాశాన్ని వదులుకోవలసి వచ్చింది. అధైర్యపడకుండా, 2024లో నీట్‌లో తుది ప్రయత్నం చేయాలని సర్ఫరాజ్ నిర్ణయించుకున్నాడు.

కష్టపడి చదివి నీట్ 2024లో సర్ఫరాజ్ 720కి 677 స్కోర్ చేసి 'నిల్ రతన్ సర్కార్ మెడికల్ కాలేజీ'లో స్థానాన్ని సంపాదించుకున్నాడు.

సర్ఫరాజ్ అచంచలమైన సంకల్పం వెనుక తన కొడుకు డాక్టర్ కావాలనే సర్ఫరాజ్ తల్లి కల ఉంది.

తెల్లటి కోటు, స్టెతస్కోప్ ధరించి, సర్ఫరాజ్ తన కుటుంబానికే కాకుండా తన గ్రామం మొత్తానికి కూడా వైద్యసేవ చేయాలని తల్లి కోరుకోవటం శ్లాఘనీయం.


సర్ఫరాజ్ కృషి గ్రామంలోని యువ పేద విద్యార్థులకు మార్గదర్శకత్వం అయినది.

"డాక్టర్ అయ్యాక పేదల మధ్య పని చేయాలని అనుకుంటున్నాను" అని సర్ఫరాజ్ చెప్పాడు.

ఇటుక బట్టీలో పనిచేసే కార్మికుడి నుండి వైద్య విద్యార్థి వరకు సర్ఫరాజ్ ప్రయాణం అసమానతలు ఉన్నప్పటికీ పెద్ద కలలు కనే వారిలో ఆశను నింపుతుంది.

"కష్టపడి పనిచేస్తే కలలు నెరవేరుతాయి" అని సర్ఫరాజ్ నవ్వుతూ చెప్పాడు.

సర్ఫరాజ్ విజయం అసంఖ్యాకమైన యువతీ యువకులకు స్ఫూర్తినిస్తుంది. దృఢ సంకల్పం, పట్టుదలతో కష్టతరమైన సవాళ్లను కూడా అధిగమించవచ్చని రుజువు చేస్తుంది. ❖




**ఐదు వేళలా నమాజు స్థాపించడం ప్రతీ ముస్లిమ్ విధిగా ఖుర్ఆన్ పేర్కొంటోంది.** హదీసు గ్రంథాలూ ఐదు నమాజుల ప్రాముఖ్యత గురించి నొక్కి చెబుతాయి. అయితే చాలామంది నాలుగు నమాజులు మాత్రం క్రమం తప్పకుండా చేసినా తెల్లవారు ఝామున మేల్కొని చేసే ఫజర్ నమాజు విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తుంటారు. మరికొంతమంది ఫజర్ నమాజును కోల్పోతున్నామని బాధపడేవారూ ఉన్నారు. చాలా ఆలస్యంగా సూర్యుడు ఉదయించిన తర్వాత మేల్కొంటారు. ఫజర్ నమాజు కోసం మేల్కొనడానికి ఎంతగా ప్రయత్నించినా వీలు కుదరడం లేదని మరికొందరి వాదన. "రాత్రి ఇషా నమాజు, ఉదయం ఫజర్ నమాజు చేసినవారు రాత్రంతా దైవారాధనలో లీనమైనంత పుణ్యం ప్రాప్తిస్తుంది" అన్న హదీసు స్ఫూర్తిగా తీసుకుంటే ఫజర్ నమాజు ఎప్పటికీ జారవిడుచుకోరు. కపటులకు మాత్రం రాత్రి ఇషా, ఉదయం ఫజర్ నమాజులు భారంగా అనిపిస్తాయి" అని హెచ్చరించారు ప్రవక్త. ఒకప్పుడు ఎవరైనా ఫజర్, ఇషా నమాజులకు గైర్హాజరైన వ్యక్తి విశ్వాసాన్ని శంకించేవారని ఉలమాలు చెబుతారు. "ఇషా, ఫజ్ర్ నమాజుల్ని సామూహికంగా చేయటంలో ఎంత పుణ్యం ఉందో ప్రజలకు తెలిస్తే, వాటి కోసం మోకాళ్లు ఈడ్చుకుంటూ నడవవలసి వచ్చినా సరే వారు తప్పకుండా వస్తారు" అని ఫజ్ర్ నమాజు ప్రాముఖ్యతను ప్రవక్త (స) తమ సహచరులకు వివరించారు.

"ఎవరైతే ఫజర్ నమాజు చేస్తారో వారు అల్లాహ్ రక్షణలో ఉంటారు" అని ప్రవక్త పేర్కొన్నారు. "రాత్రి -పగలు వేళలలో దైవదూతలు మీ వద్దకు వస్తారు. వారు సలాత్ అల్-ఫజ్ర్, సలాత్ అల్-అస్ర్ వద్ద కలుస్తారు, 'మీరు నా సేవకులను ఎలాంటి స్థితిలో కలుసుకున్నారు.?' అని అల్లాహ్ అడిగితే "వారు నమాజు చేస్తున్నప్పుడు మేము వారిని విడిచిపెట్టాము- వారు నమాజు చేస్తున్నప్పుడు మేము వారి వద్దకు వచ్చాము." అని అంటారు.

### త్వరగా నిద్రపోవాలి

ఫజర్ నమాజు వేళకు మేల్కొనకపోవడానికి ప్రధాన కారణం అర్ధరాత్రి దాటాక నిద్రించడం. నిద్ర సరిపోకపోవడం వల్ల మేల్కొనడం కష్టమవుతుంది. హదీసుల ప్రకారం, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ఇషా' నమాజు ముగిసిన వెంటనే నిద్రకు ఉపక్రమించాలని చెప్పారు. ఇషా నమాజు తరువాత మేల్కొనడం, అనవసర విషయాల్లో నిమగ్నమవడాన్ని తీవ్రంగా వారించారు. ధార్మిక జ్ఞానాన్ని అభ్యసించడానికోసమైతే మేల్కొన వచ్చు. సగటు ముస్లిమ్ త్వరగా నిద్రపోవాలన్నది ప్రవక్త ఉద్బోధ. త్వరగా నిద్రపోతే త్వరగా మేల్కొనవచ్చును. నిద్రించే ముందు ఫజర్ నమాజుకు లేవాలని సంకల్పం చేసుకోవాలి. తనను ఎవరూ లేపలేదనో, అలారం మోగలేదనో సాకులు చెప్పకూడదు. నిద్ర లేవగానే అల్లాహ్‌ను స్మరించుకోవాలి. దీనివల్ల నిద్రమత్తు, బద్ధకం పోతుంది. వుజూ చేసినప్పుడు షైతాన్ పారిపోతాడు.

### ఇంటివారిని నిద్రలేపాలి

"వారికి పరీక్షలు ఉన్నాయి, వారు అలసిపోయారు, వారిని నిద్ర పోనివ్వండి, చిన్నపిల్లలు గదా" అని ఏ తండ్రి అనకూడదు. 'మిమ్మల్ని మీ ఇంటివారినీ నరకాగ్ని నుండి కాపాడండి" అన్న ఖుర్ఆన్ హెచ్చరికను గమనిస్తే ఎలాంటి అలక్ష్యమూ దరిచేరదు. "మీ ఇంట్లో మంటలు చెలరేగాయి. అప్పుడైతే పిల్లల్ని ఆ మంటల నుండి కాపాడటానికి ఎలా మేల్కొలుపుతారో అలాగే నమాజు కోసమూ అంతే భయంతో నిద్ర లేపాలి" అని అంటారు ఉలమాలు. "రాత్రిపూట ఆరాధన నిమిత్తం నిద్రలేచే పురుషుణ్ణి దేవుడు కరుణించుగాక, అతను లేచి నమాజ్ చేస్తాడు. తన భార్యను కూడా (నమాజ్ కోసం) మేల్కొలుపుతాడు. ఒకవేళ ఆమె లేవకపోతే ముఖం మీద నీళ్లు చల్లి లేపటానికి

ప్రయత్నిస్తాడు. అలాగే రాత్రిపూట ఆరాధన నిమిత్తం నిద్రలేచే స్త్రీని దేవుడు కరుణించుగాక, ఆమె లేచి నమాజ్ చేస్తుంది. తన భర్తను కూడా (నమాజ్ కోసం) నిద్రలేపుతుంది. ఒకవేళ అతను లేవకపోతే ముఖంమీద నీళ్లు చల్లి మరీ లేపటానికి ప్రయత్నిస్తుంది.'' అని చెప్పారు ప్రవక్త.

కుటుంబ సభ్యులు ఫజ్ర్ నమాజుకు లేపడానికి ఒకరికొకరు ప్రోత్సహించాలి, నమాజు కోసం వీధి వారిని, ఇరుగు పొరుగువారి తలుపు తట్టడం ద్వారా ఒకరికొకరు సహాయం చేసుకోవచ్చు. అలారం గడియారాలు వంటి మేల్కొలపడానికి వివిధ మార్గాలను ఉపయోగించవచ్చు. వీటిని అత్యంత అనుకూలమైన ప్రదేశంలో ఉంచాలి. కొంతమంది అలారం గడియారాన్ని తల పక్కన పెట్టుకుని, అది మోగినప్పుడు, ఒక్కసారిగా ఆఫ్ చేసి, నేరుగా నిద్రపోతారు. అలాంటి వ్యక్తి గడియారాన్ని కొంచెం దూరంగా ఉంచాలి, తద్వారా అది అతనిని నిజంగా మేల్కొలుపుతోంది.

### రాత్రి ఎక్కువగా తినకూడదు

అతిగా తినడం వల్ల గాఢ నిద్రపడుతుంది. ఎక్కువగా తినేవాడు బాగా అలసిపోతాడు, ఎక్కువ నిద్రపోతాడు. కాబట్టి సాయంత్రం పూట తేలికైన ఆహారం తీసుకోవాలి. మగ్రిబ్ నమాజు తరువాత భోజనం చేయాలి. నిద్రించడానికి కనీసం రెండు గంటల ముందు తినాలి. అల్లాహ్ పట్ల భీతి, దైవ ప్రేమ ఉండే హృదయం దైవ అవిధేయతకు పాల్పడదు. రాత్రి ఎంత ఆలస్యంగా నిద్రపోయినా ఫజ్ర్ నమాజుకు మేల్కొంటాడు.

### ఫజర్ నమాజుకు గంట ముందు ఏం జరుగుతుందో తెలుసా?

అర్ధరాత్రి దాటాక రాత్రి చివరి ఘడియ మొదలైనప్పుడు ఈ విశ్వంలో ఒక వింతైన మార్పు జరుగుతుంది. ఆ మార్పు ఏమై ఉంటుందనే కదా మీ ఆత్రుత. ఏడు ఆకాశాలపైనున్న అల్లాహ్ తన సింహాసనంతోపాటు చివరి ఆకాశం మీదకు దిగి వస్తాడు. అయితే అల్లాహ్ ఎలా ఉంటాడు, మనిషి ఊహకందని విషయం. అయితే ఆ సమయంలో అల్లాహ్ ఒక ప్రకటన చేస్తాడు. 'వేడుకునే వారెవరైనా ఉన్నారా? నేను వాళ్ల విన్నపాలను స్వీకరిస్తాను' అని ప్రకటిస్తాడు. 'ఎవరికేం కావాలో వచ్చి అడగండి వారి కోరికలు తీరుస్తాను' అని. చక్రవర్తి, మంత్రి గానీ చాటింపు వేస్తే ప్రజలు తమ కోరికలు తీర్చుకునేందుకు తండోపతండాలుగా తరలి వస్తారు. మన విన్నపాన్ని నెరవేర్చే ఆ మహా చక్రవర్తి, భూమి, ఆకాశాల సృష్టికర్త స్వయంగా వచ్చి అడుగుతున్నాడు. మరి మన అభ్యర్థనల్ని, మన విన్నపాల్ని విన్నవించుకునే సమయం మనదగ్గర లేదా? ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నాం. అనారోగ్యమైనా, ఆర్థిక ఇబ్బందులైనా, సంతాన లేమి సమస్యలైనా, ఇలా సమస్య ఏదైనా ఫజర్ నమాజుకు గంట సమయం ముందుగా లేచి నమాజులో లీనమవ్వండి. ఈ వేళలో చేసే నమాజును తహజ్జుద్ నమాజు అంటారు. పూర్తి ఏకాగ్రతతో తహజ్జుద్ నమాజు, ఆ తరువాత ఖుర్అన్ పారాయణం చేయండి. మీకు వచ్చిన ఖుర్ఆన్‌లోని కొంత భాగాన్ని శ్రద్ధగా చదవండి. ఆ తరువాత చేతులెత్తి మీ సమస్యలను అల్లాహ్ ముందు మీ భాషలోనే ఏకరువు పెట్టండి. ఇలా చేయడం వల్ల అల్లాహ్‌తో సాన్నిహిత్యం పెరుగుతుంది. ఎవరైతే ఫజర్ నమాజుతో తమ దినచర్యను ప్రారంభిస్తారో అలాంటి వారు సాఫల్యం చెందుతారు. ''అస్సలాతు ఖైరున్ మినన్నావ్'' (నిద్రకంటే నమాజు మైలైనది) అన్న మౌజన్ పిలుపు విన్నవెంటనే ఫజర్ నమాజుకు లేచే భాగ్యాన్ని కలిగించు అల్లాహ్ (ఆమీన్).


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి**

విద్య విషయంలో అసూయ పడటంలో తప్పులేదు. కానీ, అది ద్వేషపూరితంగా ఉండకూడదు. పోటీతత్వంతో, పట్టుదలగా విద్య నేర్వాలి. వాయిదాలు వేయకుండా విద్యాకృషి చెయ్యాలి. కృషితో నాస్తి దుర్భిక్షం- నిరంతర కృషి ఒక్కటే విజయ ద్వారాలకు తాళపు చెవి. మరే అడ్డదారులూ ఉండవు. ప్రజాసేవ చేస్తామనేవారికన్నా, చేస్తున్నవారినే ప్రజలు నమ్ముతారు. అలాగే భక్తిని బోధించేవారిని కాకుండా, భక్తిగా జీవించేవారినే ప్రభువు సైతం ఇష్టపడతాడు.

## ప్రాపంచిక విషయాలలో పై చేయి సాధించాలనుకోవడం

మనస్సుకు కలిగే ఆందోళన ఆధి. కాగా శరీరానికి కలిగే జబ్బు వ్యాధి. అసూయ అనే మానసిక అనారోగ్యం, దౌర్బల్యం శారీరక అనారోగ్యం కంటే ప్రమాదకరమైంది. మొదటిది వ్యాధి ఇది ఆధి. వ్యాధికి మందులుంటాయి. కాని ఆధికి మందులు లేవు. మనోవ్యాధికి మందు లేదు, స్వీయ పరిశీలన, స్వీయ సంస్కరణ తప్ప. అసూయ అనే చింతా జ్వరం బుద్ధిని, నిద్రను, ఉత్సాహాన్ని, ఆకలిని, ఆకారాన్ని, తేజస్సును బలాన్ని క్రమక్రమంగా క్షీణింపజేస్తుంది.

ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించా లన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు.

(అత్ తకాసుర్: 1,2)

ఒకానొక సందర్భంలో దైవప్రవక్త (స) తన సహాబాను ఉద్దేశించి: "అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. మీరు ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్న భయం నాకు లేదు. కాని గత సమాజాల్లో మాదిరిగా మీక్కూడా పుష్కలంగా ప్రాపంచిక సిరిసంపదలు లభిస్తే మీరూ వారిలాగే ప్రాపంచిక వ్యామోహంలో పోటీ పడతారేమోనని నాకు భయంగా ఉంది. అలా చేస్తే ఈ ప్రాపంచిక వ్యామోహం గత సమాజాలను నాశనం చేసినట్లుగా మిమ్మల్ని కూడా నాశనం చేయవచ్చు" అని వారిని హెచ్చరించారు. (బుఖారీ- ముస్లిం)

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: మీలో ఎవరైనా ఐశ్వర్యంలో, దేహ నిర్మాణంలో (అంటే అందంలో) తనకంటే ఆధిక్యత ప్రసాదించ బడిన మనిషిని గనక చూస్తే అతను తనకంటే తక్కువ స్థాయి గలవారిపై కూడా దృష్టి సారించాలి. (సహీహ్ బుఖారీ)

## దిష్టి, అసూయ

ఇమామ్ ఇబ్ను ఖయ్యిమ్ (రహ్మ) ఇలా అసూయాపరుడు, దిష్టి పెట్టేవాడు ఒక విషయంలో ఏకీభవిస్తారు, ఒక విషయంలో

విభేదిస్తారు. 1) అసూయపరుడు చూసి, చూడకుండా రెండు స్థితుల్లోనూ కుళ్ళుకుంటాడు. దిష్టి పెట్టేవాడు చూసి దిష్టి పెడ్తాడు.

2) అసూయ అనేది మానవుల వరకే పరిమితం అవుతుంది. కానీ, దిష్టి మనుషులకు, జంతువులకు, వ్యాపారానికి, వస్తువులకు కూడా తగులుతుంది. ఆ రకంగా అసూయతో దిష్టి తగిలించే వాడు అత్యంత ప్రమాదకారి.

గ్రంథ ప్రజల్లో చాలామంది మిమ్మల్ని ఎలాగైనా విశ్వాసం నుండి తప్పించి అవిశ్వాసం వైపు లాగాలని చూస్తున్నారు. సత్యం వారిముందు స్పష్టంగా వెల్లడైనప్పటికీ వారు అసూయతో ఉడికి పోతూ మిమ్మల్ని అవిశ్వాసులుగా మార్చదలిచారు. కాబట్టి అల్లాహ్ వారి విషయంలో ఒక నిర్ణయం తీసుకునేవరకు వారిని క్షమించి, చూసీ చూడనట్లు వదిలేయండి. దేవుడు ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (బఖర : 109)

చెప్పు: ''నేను ఉషోదయానికి ప్రభువయిన దేవుని శరణు గోరుతున్నాను. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడునుండి, ముసురు కొచ్చే రాత్రిచీకటి కీడునుండి, (మంత్ర) ముడులపై ఊదేవారి కీడునుండి, అసూయాపరుడి కీడునుండి నేను ఆయన శరణు గోరుతున్నాను.'' (ఫలఖ్: 1-5)

## అసూయ అపాయాలు

1) అసూయ అనే ఆధి మానసిక వ్యధకు, మనోవేదనకు గురి చేస్తుంది. దాని మూలంగా శరీరం కూడా ఇబ్బందులు పడు తుంది. అసూయ నయం కాని రోగం, దూరంకాని దుఃఖం. అదొక మానసిక వ్యాధి అన్నారు ఇబ్న్ అల్-ముతజ్ (రహ్మ)

2) అసూయాపరుని పరువుప్రతిష్ఠలు మంట గలుస్తాయి. క్రమేపి అతని ప్రభ క్షీణించి పోతుంది. ప్రజలు అతని నుండి దూరంగా పారిపోతారు. అసూయ పరుడు ఎన్నటికీ నాయకుడు కాలేడు అని మంసూర్ అల్-హికామ్‌లో చెప్పబడింది.

3) ప్రజలు అతని పట్ల ప్రేమ భావన బదులు ద్వేష భావన కలిగి ఉంటారు. వారిలో అతని యెడల స్నేహ భావం కాకుండా వైర భావం ఉంటుంది. అతన్ని వారు శత్రువుగానే భావిస్తారు. ఫలితంగా అతను హృదయ గదుల నుండే కాకుండా భౌతిక గృహాల నుండి కూడా వెళ్లగొట్టబడతాడు.

4) అసూయ అనే అవలక్షణం వల్ల మనిషి అల్లాహ్ పంపకాన్నే ప్రశ్నించి ఆయన ఆగ్రహానికి గురవుతాడు. ఏక సమయంలో అటు ప్రభువుకి ఇటు ప్రజలకి దూరం అవుతాడు.

5) అసూయ పరోక్ష నిందకు, చాడీలకు దారితీస్తుంది.

6) అసూయ అన్యాయానికి, దురాక్రమణకు దారి తీస్తుంది.

7) అసూయ దొంగతనం, హత్యకు దారితీస్తుంది.

## ఇంటా బయటా హాని..!

1) అసూయ అన్నది ఒక బలహీనత, ఒక అవగుణం. అల్ప బుద్ధిగల వారే అసూయతో కృంగిపోతారు. పరిస్థితులు ఎటువంటి వైనా మనం అసూయను సమర్థించకూడదు. ఇది ముమ్మాటికి మనకు ఇంటా బయటా హానిని కలిగిస్తుంది. దైవప్రవక్త (స) ఇలా అన్నారు: మీకు పూర్వం జాతులలో ప్రబలి ఉండే ఒక రుగ్మత మీలో కూడా చోటు చేసుకుంది. అదే అసూయ, ద్వేషం. ఇది మనిషి వెంట్రుకలను కాదు గానీ, అతని ధర్మాన్ని పూర్తిగా క్షవరం చేసేస్తుంది. (తిర్మిజీ)

2) దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''ధర్మ మార్గంలోని దుమ్ము, నరకాగ్ని ఏక సమయంలో ఒక దేహంలో ఇమడజాలవు. అలాగే విశ్వాసం, అసూయ ఒకే సమయంలో ఓ మనసులో ఇమడ జాలవు. (ఇబ్ను హిబ్బాన్)

3) అసూయ వల్ల సమాజంలో మంచి అంతరించి, రాగద్వేషాలు రాజుకుంటాయి. దైవప్రవక్త(స) ఇలా అన్నారు: అసూయ పడనంత కాలం ప్రజలు మంచి స్థితిలోనే ఉంటారు. (సహీహ్ అత్తర్గీబ్)

4) అల్లాహ్ ఆగ్రహానికి గురవుతారు: ''అసూయకు దూరంగా ఉండండి ఎందుకంటే అగ్ని కట్టెలను భస్మీపటలం చేసినట్లే అసూయ సత్కార్యాలను హరించి వేస్తుంది.'' (అబూదావూద్)

5) ప్రజాగ్రహం, ఏవగింపు: ''ప్రజల్లో అత్యంత చెడ్డ వారు - ఎవరైతే ప్రజల్ని ద్వేషిస్తారో, ఎవర్నయితే ప్రజలు కూడా ద్వేషిస్తారో వారు'' అన్నారు ప్రవక్త(స). (జయీఫ్ అత్తర్గీబ్)


తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## అసూయా ద్వేషాలకు విరుగుడు 'అవ్యాజ ప్రేమ'..

ఆప్యాయత అమృతాన్ని పంచితే అసూయ విషాన్ని చిమ్ముతుంది అసూయ ఆప్యాయతకు చేరువవుట బహు కష్టం కాని ఆప్యాయత తప్పక అసూయని చవి చూస్తుంది. అప్పుడప్పుడు అన్పిస్తూ ఉంటుంది- మనవారు అనుకున్న మన మనుష్యుల మధ్య దగా పడడం.. నమ్మించి మన చుట్టూ వల వేసి మోసగించడం వారికే చెల్లింది.. బహుశా తిన్నింటి వాసాలు లెక్క పెట్టటం అంటే ఇదేనేమో.. మన పక్కనే ఉంటూ మన పతనం కోరుకునే అసూయ పరులు వీరేనేమో...?

సద్గుణశీలుడికి స్వాగత సత్కారాలు ఉండకపోవచ్చు. మనిషి తన బాటలో ఇబ్బంది కలిగించే రాళ్లు, ముళ్లు తొలగించి మార్గం సుగమం చేసుకొని ముందుకు సాగుతాడు. దుర్గుణాలనే గాజుపెంకుల్నీ జీవనయానమనే బాట నుంచి తొలగించుకోవాలి. ఆ పని ఎవరికి వారే చేసుకోవాలి. వేరెవరో చేయరు. దేహంలోని ముళ్లు తీయవచ్చుగానీ మనసులోని ముళ్లు ఎవరు తీయగలరు? ఎవరికి వారే తొలగించుకోవాలి. అందరికీ ఆ నేర్పు ఉండదు. కారణం- చాలామంది తాము ఎలాంటి తప్పులూ చేయడం లేదనే భ్రమలోనే జీవిస్తుంటారు. తమ మనసులో దుర్గుణాలనే ముళ్లు ఉన్నాయన్న సంగతి సైతం తెలియనంతగా, వారి అజ్ఞానం ఉంటుంది. ఇక వాటిని తొలగించుకోవాలని ఎవరైనా ఎలా అనుకుంటారు?

ఎవరి మీదైనా మనకు ఈర్ష్య ఇప్పటికే ఏర్పడిపోయిందేమో మనలోకి మనమే తరచి చూసుకోవాలి. అలాంటిది ఉంటే శషభిషలు లేకుండా ఈర్ష్యకు లోనయ్యామనే విషయాన్ని ఒప్పుకోవాలి. అప్పుడే దీని నుండి త్వరగా బయటపడేందుకు అవకాశం ఉంటుంది. ఈర్ష్య మనసులో ఏర్పడినప్పుడు మానసిక ప్రవర్తన విపరీత పోకడలు పోతూ ఉంటుంది. వారు తమలోతామే కుమిలిపోతుంటారు. నిస్సహాయంగా ఉంటారు. కొంతమంది తమకు కలిగిన చిన్న అసౌకర్యానికి కూడా నెపం అవతలి వాళ్లపై నెట్టేస్తుంటారు.

అధిక శాతం మానవుల్లో అసూయ, ద్వేషం అనే రెండు ముళ్లు అశాంతిని కలిగిస్తుంటాయి. ఎదుటివారు స్వశక్తి, కృషి, అంకిత భావంతో అభివృద్ధి సాధిస్తుంటే ఓర్వలేరు. అసూయతో రగిలి పోతుంటారు. సందర్భం ఉన్నా లేకపోయినా వారి గురించి ద్వేషంతో విషం కక్కుతుంటారు. పాముకు కోరల్లోనే ఉండే విషం వీరికి అణువణువునా నిండి విషవృక్షంలా కనిపిస్తారు. ఈ కారణం వల్లనే ఆధునిక ప్రపంచం ప్రేమలేని ఎడారిలా మారింది. విషానికి విరుగుడుగా సంజీవని ఉన్నట్లే, అసూయా ద్వేషాలకు విరుగుడుగా 'అవ్యాజ ప్రేమ'ను చెప్పుకోవాలి. మనసుకు ప్రేమను నేర్పాలి. అది పెరిగే కొద్దీ అసూయ, ద్వేషం మంచులా కరిగిపోతాయి. అప్పుడు జీవనయానం పూలబాటలోనే సాగుతుంది!

**ఆ రోజు సిరి సంపదలుగానీ, సంతానంగానీ దేనికీ పనికి రావు. స్వచ్ఛమయిన హృదయంతో అల్లాహ్ సన్నిధిలోకి వచ్చిన వాడు మాత్రమే (ఆనాడు మోక్షం పొందుతాడు)". (షుఅరా: 88,89)**

మనలోని భావోద్వేగాల, అనుభూతుల, కోరికల, ఆలోచనల కేంద్రం హృదయం. ఏదయినా వస్తువు, ప్రాణి మీద ప్రేమ, ద్వేషం, అయిష్టం కలిగించే ఆంతరంగిక ప్రేరణ హృదయం. మనిషి భావాలు, అభిప్రాయాలు, ఆచరణలు అన్నింటికీ మూలం హృదయం. అందుకే "మనిషి నడవడి, ప్రవర్తన అతని మానసిక స్థితికి అద్దం పడుతుంది" అన్నారు పెద్దలు. ఇదే హృదయం గురించి తెలియజేస్తూ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు:

**"దేహంలో ఒక మాంసపు ముద్ద ఉంది. అది గనక బాగుంటే దేహమంతా బాగుంటుంది. అది గనక పాడయితే శరీరం మొత్తం పాడవుతుంది. గుర్తుంచు కోండి! అదే హృదయం!" (బుఖారీ)**

ఈ కారణంగానే అల్లాహ్ హృదయాన్ని స్వచ్ఛగా ఉంచుకోవాలని ఆదేశించాడు: "నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో". (అల్ ముద్దస్సిర్: 4) ఈ వచనంలో దుస్తులు అంటే హృదయం అన్నది పండితుల మాట.

'నరోత్తములు ఎవరు?' అని ప్రశ్నించగా- "హృదయ స్వచ్ఛత, మాట సత్యత గల ప్రతి వ్యక్తి" అని ప్రవక్త (స)సమాధానమిచ్చారు. 'మాట సత్యత అంటే మాకు తెలుసు. మరి హృదయ స్వచ్ఛత (మఖ్మూముల్ ఖల్బ్) అంటే ఏమి?' అని సహాబా వివరణ కోరగా, "తఖ్వా పరుడు, పరిశుద్ధుడు, ఎలాంటి పాప భావం లేనివాడు, ఎలాంటి అతిక్రమణకు పాల్పడనివాడు, మోసం చెయ్యనివాడు, అసూయ చెందనివాడు" అని అన్నారు ప్రవక్త(స) (ఇబ్ను మాజహ్)

**వారిలా ప్రార్థిస్తారు: "ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. (యావత్తు) విశ్వాసుల పట్ల మా హృదయాల్లో ఎలాంటి కినుకను ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప క్షమాశీలివి, అపార దయామయుడవు." (హష్ర్: 10)**



# కేరళలో సంస్కృతం బోధిస్తున్న ముస్లిం ఉపాధ్యాయులు

**- అస్ఘర్ అలీ**

**సంస్కృతం** సాధారణంగా హిందూ పండితులు బోధిస్తూ ఉంటారు. కాని దీనికి భిన్నంగా కేరళలో హిందూయేతర ఉపాధ్యాయులు విద్యార్థులకు సంస్కృతం బోధిస్తున్నారు.

సంస్కృతంలో డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన వారికి పాఠశాల లేదా కళాశాలలో ఉద్యోగాలు లభిస్తున్నాయి. చాలా మంది హిందూయేతర విద్యార్థులు ముఖ్యంగా ముస్లింలు ఉన్నత విద్యలో సంస్కృతాన్ని తమ సబ్జెక్ట్‌గా, హయ్యర్ సెకండరీలో రెండవ భాషగా ఎంచుకుంటున్నారు.

ముస్లింలు పాఠశాలలు, విశ్వవిద్యాలయాలలో సంస్కృత బోధన కోసం ఉద్యోగాలు పొందుతున్నారు. సంస్కృతంతో ఇంటర్మీడియట్ పాఠశాలల్లో బోధన కోసం ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు.

కేరళ విశ్వవిద్యాలయాలలో ఫ్యాకల్టీ/అధ్యాపక ఉద్యోగాలలో మైనారిటీలకు కోటా ఉంది. ఉదాహరణకు కేరళలోని ఎం.జీ విశ్వవిద్యాలయం, శంకర విశ్వవిద్యాలయంలో ముస్లింలు ఫ్యాకల్టీగా ఉన్నారు.

కేరళలోని వివిధ కళాశాలల్లో ముస్లిం సంస్కృత ఉపాధ్యాయుల సంఖ్య తగినంతగా ఉంది. కేరళ ప్రభుత్వం మూడు సంస్కృత కళాశాలలను నిర్వహిస్తుంది. ఇవన్నీ మైనారిటీ కోటాలో ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

కాలికట్ విశ్వవిద్యాలయం సంస్కృత విభాగంలో ఇద్దరు ముస్లిం ఉపాధ్యాయులు డాక్టర్ కెకె అబ్దుల్ మజీద్, డాక్టర్ ఎన్ఎ షిహాబ్ ఉన్నారు. కేరళలో పాఠశాలలు, కళాశాలలలో కూడా ముస్లిం సంస్కృత ఉపాధ్యాయులు కలరు.

డాక్టర్ మజీద్ కాలికట్ యూనివర్సిటీలో రీసెర్చ్ గైడ్, నలుగురు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. వారిలో ఇద్దరు ముస్లింలు. వారిలో మహ్మద్ షమీమ్ మూడుసార్లు NET, JRF అర్హత సాధించాడు, పాఠశాలలో ఉద్యోగం కూడా పొందాడు.

ప్రతి యూనివర్శిటీలో సంస్కృత విభాగంలో ప్రతి సంవత్సరం కనీసం 1-2 మంది ముస్లింలు ఉంటారు. కాలికట్ విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ ముస్లిం వర్గాలకు చెందిన విద్యార్థులను కలిగి ఉంది.

"కేరళ విశ్వవిద్యాలయంలో గత 25 సంవత్సరాలుగా ముస్లిం ఉపాధ్యాయులు సంస్కృతం బోధిస్తున్నారు, అలాగే కాలికట్ యూనివర్సిటీలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు"

సంస్కృతం ఎంపిక ఉద్యోగాలు ఇవ్వగలదు అని ముస్లిం విద్యార్థులు భావిస్తున్నారు. భాషను మతంతో ముడిపెట్టడం సమంజసం కాదు అని ముస్లిం విద్యార్థులు భావిస్తునారు. భాష అభివృద్ధికి నిజమైన నిబద్ధత కావలి.

సంస్కృత పండితుడు ఓనంపిల్లి ఫైజీ వేదాంత, ఖురాన్ బోధించే ఇస్లామిక్ అకాడమీని నడుపుతున్నాడు. ❖




## ఈవీఎంలు వద్దు!

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై దేశ వ్యాప్తంగా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలో తమకు ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపరే కావాలంటూ మరో గ్రామం డిమాండ్ చేసింది. ఇకముందు గ్రామంలో జరిగే ఏ ఎన్నిక అయినా బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్ర సతార జిల్లాలోని కొలేవాడి గ్రామ సభ తీర్మానించింది. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు డిసెంబర్ 2న ఈ తీర్మానం చేసినట్టు సర్పంచ్ భర్త తెలిపారు.

## 'పర్యాటక' కాలుష్యం.. టాప్ 3లో భారత్



అంతర్జాతీయ, దేశీయ పర్యాటకం ద్వారా వెలువడుతున్న కాలుష్య ఉద్గారాల్లో.. చైనా, అమెరికా, భారత్ దేశాల వాటా అత్యధికంగా ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. పర్యాటక కాలుష్య ఉద్గారాల్లో ఇవి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయని 'క్వీన్స్‌లాండ్ వర్సిటీ' పరిశోధకులు లెక్కగట్టారు. 2009 నుంచి 2019 వరకు పదేండ్లలో 175 దేశాల దేశీయ, అంతర్జాతీయ పర్యాటకం వల్ల గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల్లో పెరుగుదలను అంచనావేశారు. చైనాలో ఏటా పెరుగుతున్న (17శాతం) దేశీయ పర్యాటకం కారణంగా కాలుష్య ఉద్గారాలు 0.4 గిగాటన్నులు పెరిగిందని, అమెరికా వల్ల 0.2 గిగాటన్నులు, భారత్ వల్ల 0.1 గిగా టన్నులు కాలుష్యం భూ వాతావరణంలోకి చేరిందని అధ్యయనం తెలిపింది. పదేండ్లలో పర్యాటకం వల్ల కాలుష్య ఉద్గారాల విడుదల 3.7 నుంచి 5.2 గిగాటన్నులకు చేరుకుంది.

## వరకట్న వేధింపుల కేసుల్లో అప్రమత్తంగా ఉండాలి.. కోర్టులకు సుప్రీం సూచన..!

వరకట్న వేధింపుల కేసుల్లో కోర్టులు అప్రమత్తంగా ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా చూడాలని చెప్పింది. భర్త తరఫు వారిని ఇరికించే ధోరణులు కనిపిస్తున్న నేపథ్యంలో చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా.. అమాయక కుటుంబ సభ్యులు అనవసర ఇబ్బందులు పడకుండా జాగ్రత్తపడాలని చెప్పింది. ఫ్యామిలీ వివాదాల కారణంగా తలెత్తే క్రిమినల్ కేసుల్లో నిర్దిష్ట ఆరోపణలు లేకుండా కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించడాన్ని ప్రారంభంలోనే అడ్డుకోవాలని జస్టిస్ బీవీ నాగరత్న, ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కొందరు వివాహితలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తమ భర్తలను, వారి బంధువు లను వేధించేందుకు ఐపీసీ సెక్షన్ 498ఏను దుర్వినియోగం చేయడం పెరుగుతుండటం పట్ల సుప్రీంకోర్టు డిసెంబరు 11న ఆందోళన వ్యక్తం చేసింది. బెంగళూరులో ఐటీ ప్రొఫెషనల్ అతుల్ సుభాష్ తన భార్య వేధింపులను భరించలేక ఆత్మహత్యకు పాల్పడటంపై ప్రజలు పెద్ద ఎత్తున స్పందిస్తున్న తరుణంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ విధంగా స్పందించింది. వివాహితలపై వారి భర్తలు, అతని తరపు బంధువులు క్రూరత్వానికి పాల్పడితే, వారిని శిక్షించాలని ఈ సెక్షన్ చెప్తున్నదని, కానీ ఈ సెక్షన్ దుర్వినియోగమవుతున్నదని వ్యాఖ్యానించింది.

## వీహెచ్‌పీ కార్యక్రమంలో హైకోర్టు జడ్జ్ విద్వేషపూరిత ప్రసంగం.. సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం

విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. దీనిపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని అలహాబాద్ హైకోర్టును డిసెంబరు 11న ఆదేశించింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల వీహెచ్‌పీ లీగల్ సెల్ నిర్వహించిన కార్యక్రమానికి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం వివాహ వ్యవస్థ గురించి వివాదాస్పద వ్యాఖ్యలు అలాగే, ఉమ్మడి పౌరస్మృతిని సమర్థిస్తూ ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది.




## 30 నిమిషాల వ్యాయామంతో జ్ఞాపకశక్తి మెరుగు

వయసు పెరిగే కొద్దీ జ్ఞాపకశక్తి, ఆలోచనా శక్తి తగ్గుతుంటుంది. దీనికి పరిష్కారం కనుగొనేందుకు యూనివర్సిటీ కాలేజ్ లండన్ పరిశోధకులు వినూత్న ప్రయోగం చేశారు. రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయటం ద్వారా జ్ఞాపకశక్తి, ఆలోచనాశక్తి మెరుగవుతున్నదని సైంటిస్టులు తేల్చారు. 'బ్లూమ్‌బర్గ్' కథనం ప్రకారం, రోజూ 30 నిమిషాలపాటు వ్యాయామంతోపాటు రాత్రి కనీసం 6 గంటలు కంటినిండా నిద్ర ఉంటే.. మరుసటి రోజుకి ఆ వ్యక్తి ఆలోచనా శక్తి మెరుగువుతున్న సంగతి పరిశోధకులు గుర్తించారు. 50 -83 ఏండ్ల వయసున్న 76 మందిని ఎంచుకొని 8 రోజుల పాటు వారితో 30 నిమిషాలపాటు వ్యాయామం చేయించారు. వారి జ్ఞాపకశక్తిని పరీక్షించేందుకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించారు. రోజూ అరగంట వ్యాయామం చేయటం ద్వారా, మరుసటి రోజు నిర్వహించిన ఆన్‌లైన్ టెస్ట్‌లో వాళ్ల స్కోర్ 2 నుంచి 5% పెరిగినట్టు గుర్తించారు.

## గుండెలో మినీ బ్రెయిన్

మెదడు నుంచి వచ్చే సంకేతాల ఆధారంగా గుండె పని చేస్తుందనేది ఇప్పటివరకు వైద్యులు విశ్వసిస్తున్న విషయం. అయితే, గుండె తన సొంత నాడీ వ్యవస్థపైనే ఆధారపడి పని చేస్తుందని తాజాగా పరిశోధకులు గుర్తించారు. స్వీడన్‌లోని కరోలిన్‌స్క ఇన్‌స్టిట్యూట్, అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ కొత్త విషయాన్ని కనుగొ న్నారు. మనుషుల శరీర తత్వంతో పోలికలు ఉండే జీబ్రాషిఫ్‌పై వీరు నిర్వహించిన అధ్యయనం వివరాలు 'నేచర్ కమ్యూనికేషన్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం ఇప్పటి వరకు గుండెలోని నాడీ వ్యవస్థ కేవలం మెదడుపై ఆధారపడే పని చేస్తుందని అందరూ భావిస్తున్నారు. అయితే, గుండెలో సంక్లిష్టమైన న్యూరాన్ల వ్యవస్థ ఉందని పరిశోధకులు గుర్తించారు. 'మినీ బ్రెయిన్'గా పరిశోధకులు పేర్కొంటున్న ఈ వ్యవస్థనే హృదయ స్పందనను నియంత్రిస్తున్నది. ఎలాగైతే కదలికలు, ఊపిరి తీసుకోవడాన్ని మెదడు క్రమబద్ధీకరిస్తుందో, అలాగే ఈ గుండెలోని మినీ బ్రెయిన్ హృదయ స్పందనను నియంత్రిస్తున్నది. అరిథ్మియా వంటి గుండె సంబంధ వ్యాధుల చికిత్సకు తమ అధ్యయనం ఉపయోగపడుతుందని పరిశోధకులు పేర్కొన్నారు.

## వారానికి 4 రోజులే పని!

దేశంలో జననాల రేటును పెంచేందుకు జపాన్ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతున్నది. వారానికి నాలుగు రోజుల పని దినాలను అమలు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల క్షీణిస్తున్న సంతానోత్పత్తి సమస్యను ఎదుర్కోవచ్చని ప్రభు త్వం భావిస్తున్నది. జపాన్‌ను ప్రస్తుతం వృద్ధ జనాభా సంఖ్య ఆందోళనకు గురి చేస్తున్నది. దేశ జనాభా మొత్తంగా తగ్గుతున్నప్పటికీ 65 ఏండ్లు పైబడిన వృద్ధులు దేశంలో 29.3%మంది ఉండడం ప్రభుత్వాన్ని ఆందోళన పరుస్తున్నది. కొత్త విధానం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు వారానికి 3 రోజులు కుటుంబంతో గడపవచ్చు. టోక్యో మహిళా గవర్నర్ యురికో కొయికే ఈ ఆలోచనను అమలు చేయనున్నారు.

## పెరిగిన మానవ అక్రమ రవాణా

అంతర్జాతీయంగా మానవుల అక్రమ రవాణా పెరిగిందని ఐక్యరాజ్య సమితి సంస్థ యుఎన్‌ఓడిసి పేర్కొంది. ఈ మేరకు ఇటీవల ఒక నివేదికను వెలువరించింది. 2019లో కరోనా ముందు నాటి స్థాయితో పోల్చితే 2022లో ఈ అక్రమ రవాణా బాధితుల సంఖ్య 25శాతం మేరా పెరిగిందని పేర్కొంది. వ్యక్తుల అక్రమ రవాణాపై 2024 గ్లోబల్ రిపోర్ట్‌ను మాదకద్రవ్యాలు, నేరాలపై ఐక్యరాజ్య సమితి కార్యాలయం (యుఎన్‌ఓడిసి) ప్రచురించింది. ఇందుకు దారిద్ర్యం, ఘర్షణలు, వాతావరణ విపత్తులు వంటి అంశాలను కారణాలుగా చూపింది. వీటివల్ల ప్రజలు దోపిడీకి గురి కావడానికి అవకాశాలు పెరిగాయని పేర్కొంది. బాలల రవాణా, బలవంతంగా కార్మికులను తరలించడం, అలాగే బలవంతంగా నేరాలు చేయించడం వంటి అంశాలు కూడా ఇదే కాలంలో పెరిగాయని ఆ నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా చూసినట్లైతే వెట్టి చాకిరి కోసం తరలించే బాధితుల సంఖ్య 2019తో పోలిస్తే 2022లో 47 శాతం పెరిగింది. బాల బాధితుల సంఖ్య 31 శాతం పెరిగింది. ఇక బాలికల అక్రమ రవాణా 38 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. 156 దేశాలకు చెందిన డేటాను ఈ నివేదిక విశ్లేషించింది. ప్రపంచవ్యాప్తంగా 2022లో ఈ అక్రమ రవాణా బాధితుల్లో మహిళలు, బాలికలు 61 శాతం వున్నారని వెల్లడించింది. వీరిలో 60శాతం మంది బాలికలను లైంగిక దోపిడీ కోసమే బలవంతంగా తరలించారని పేర్కొంది. ఆన్‌లైన్ కుంభకోణాలతో సహా బలవంతంగా నేరాలకు పాల్పడేలా చేయడం కూడా బాగా పెరిగిందని పేర్కొంది.

# నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది


## ముహమ్మద్ వహీదుద్దీన్

**సుల్తాన్‌పూర్** అనే ఊరిలో ముహమ్మద్ అబ్దుల్ జబ్బార్ ఖాన్ అనే యువకుడు ఉండేవాడు. ఏ పనినీ నిలకడగా, శ్రద్ధగా, మనసు పెట్టి చేయడు. ఎక్కడ పని చేసినా అక్కడి వారితో గొడవ పడేవాడు. ఇష్టం వచ్చినట్టు తిట్టేవాడు. ప్రతి ఒక్కరితో గొడవ పడుతుండటంతో ఎవరూ అతనికి పని ఇచ్చేందుకు ముందుకు వచ్చేవారు కాదు. అతనిని చూడగానే దూరం నుంచి వెళ్లిపోయే వారు. దీంతో జబ్బార్‌ఖాన్ ఉపాధి కోసం దగ్గరలోని నవాబ్ బాద్ పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ జీషాన్ ఖాన్ అనే ఒక పెద్దాయన కనిపించాడు. ఆ పెద్దాయన్ను "నవాబ్ బాద్ పట్టణ ప్రజలు ఎలాంటి వారు?" అని అడిగాడు. దానికి పెద్దాయన ఎగాదిగ, క్రింది నుంచి పైకి, కుడి నుంచి ఎడమవైపునకు చూసి, "నువ్వెక్కడ నుండి వస్తున్నావు నాయన, ముందు మీ ఊరు వాళ్లను గురించి చెప్పు" అనడిగాడు.

దానికి విచారంగా "ఏమి చెప్పమంటారు, మా ఊరు సుల్తాన్‌పూర్ వాళ్ల గురించి చెప్పాలంటేనే నాకు సిగ్గుగా ఉంది. వాళ్లంతా దుర్మార్గులు. స్వార్థపరులు, అందుకే మా ఊరిని విడిచి పెట్టి మీ పట్టణానికి చేరుకున్నాను. అయినా ఇదంతా అడిగి నన్నెందుకు బాధపెడుతున్నారు. మీ పట్టణం వాళ్ల గురించి చెప్పండి. పెద్దాయన్ను" అడిగాడు.

దానికి ఆ పెద్ద మనిషి మీ ఊరి వాళ్లలానే మా పట్టణ ప్రజలూ దుర్మార్గులు, అబద్ధాలకోరు, తాగుబోతులు, పచ్చి స్వార్థపరులు." అని బదులిచ్చాడు. వారిద్దరూ మాట్లాడుకుంటుండగా మరో యువకుడు మధ్యలో వచ్చి మాట కలిపాడు. మధ్యలో వచ్చిన యువకుడూ ఆ పెద్ద మనిషిని ఈ పట్టణ ప్రజల గురించి అడిగాడు. దానికి పెద్దాయన "ముందు నీ ఊరు నసీర్ నగర్ గురించి మంచీ -చెడులు వివరించు" అని అడిగాడు. దీనికి ఆ యువకుడు చిరునవ్వులు చిందిస్తూ... నా గ్రామస్తు లంతా చాలా మంచివాళ్లు, మా వాళ్లు గుర్తుకొస్తే నా మనసు ఎంతో సంతోషంగా మనసుకు ప్రశాంతత కలుగుతుంది. మా ఊరి వాళ్లను విడిచినందుకు నాకు ఎంతో బాధగా ఉంది. మనసు బరువెక్కుతుంది. కన్నీటి బిందువులు రాలుతాయి. ఉపాధి కోసం భార్యా పిల్లలను వదిలి చేసేది లేక ఊరిని వదిలి ఈ పట్టణానికి వలస వచ్చాను." అని వివరించాడు యువకుడు. దానికి పెద్దాయన మాట్లాడుతూ "మీ ఊరి ప్రజల్లాగే ఇక్కడి వారు కూడా చాలా మంచివాళ్లు" అన్నారు. ఆ పెద్దాయన తనకో సమాధానం, మధ్యలో వచ్చినతనికి మరో సమాధానం చెప్పేసరికి జబ్బర్ ఖాన్ ఆశ్చర్యపోయాడు. అయినా నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. మనం ఎదుటి వారితో ఎలా మసలు కుంటామో వారూ అలానే ప్రవర్తిస్తారు. మంచి వాళ్లకు ఎప్పుడూ మంచే జరుగుతుంది. చెడుకు పర్యవసానం చెడే." అని ఇద్దరికీ హిత బోధలు చెప్పాడు ఆ పెద్దాయన. దానికి జబ్బార్ ఖాన్ పెద్దాయనతో మీరు చెప్పే మాటలు నాకు కనువిప్పు కలిగించాయి. నా తప్పులు తెలుసుకోకుండా ఎదుటి వారి తప్పుల్ని వెదికేవాడిని. అందుకే నేను నా ఊరిని గురించి చెడుగా మాట్లాడాను" అని పశ్చాత్తాపం చెందాడు. ఆ పెద్దాయన "నేను మీ ఇద్దరికీ ఈ పట్టణంలో ఇన్షా అల్లాహ్ ఉపాధి మార్గం చూపుతాను. ఎదుటి వారిలోని లోపాలను ఎంచకుండా మీ పనిపై మీరు దృష్టి పెట్టండి" అన్నారు పెద్దాయన. మన మాట, క్రమశిక్షణ, నడవడిక, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన విధంగా నడుచుకుంటే మన జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. జీవితంలో విజయాలు సాధించే మంచిమార్గం సులభం అవుతుంది.

తుదిగేటు



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**